ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
బుధవారం 29 జనవరి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 76

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.149	235	265
సూర్యాపేట	రూ.135	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.5 । కనిష్ఠం 18.0


నల్లగొండలో ధర్నాలో పాల్గొన్న కార్యకర్తలు

దమ్ముంటే సభ పెట్టి ఏం చేశారో చెప్పండి

- నల్లగొండకు ఏడాదిలో ఉత్తమ్, కోమటిరెడ్డి చేసిందేమీలేదు
- అన్నిరంగాల్లో అభివృద్ధి చేసింది కేసీఆరే
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రైతాంగ సమస్యలపై బీఆర్‌ఎస్ పోరాటం : మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి
- నల్లగొండ గడియారం సెంటర్‌లో బీఆర్‌ఎస్ 'రైతు మహాధర్నా'

'కోమటిరెడ్డి వెంకటరెడ్డి మీకు దమ్ము, ధైర్యముంటే గడియారం సెంటర్‌లో మాలాగే మీటింగ్ పెట్టి, ఈ ఏడాది కాలంలో ఏం చేశారో వివరించాలి.. మా పార్టీ నుంచి జగదీష్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి వస్తారు.. మా పదేళ్ల పాలనలో ఏం చేశామో వివరిస్తారు' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే.తారకరామారావు సవాల్ చేశారు. మంగళవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నల్లగొండలో నిర్వహించిన రైతు మహాధర్నాలో ఆయన మాట్లాడారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

మీటింగ్ పెడతామంటే పోలీసులతో అడ్డుకున్నారని, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిపై పోలీసులను అడ్డుపెట్టి దాడిచేయించారని, తాము మీటింగు పెడతామంటే మంత్రికి అంత భయమెందుకని ప్రశ్నించారు. కొందరు పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలకు మించి ప్రవర్తిస్తున్నారని, రానున్నది గులాబీపార్టీయేనని, వడ్డీతో సహా తిరిగిస్తామని హెచ్చరించారు. ఇటీవల ఒక మంత్రి అసెంబ్లీలో నల్లగొండకు కేసీఆర్ ఏం చేశారని ప్రశ్నించారని, నల్లగొండను దేశంలోనే అత్యధికంగా వరి పండించే ప్రాంతంగా తీర్చిదిద్దింది కేసీఆరే అని, ఎస్‌ఆర్‌ఎస్పీ స్టేజీ-2 కింద, నాగార్జునసాగర్ కింద టెయిలాండ్ భూములకు నీరందించింది కేసీఆరే అని అన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక ఉత్పత్తి సామర్థ్యంతో దామరచర్లలో విద్యుదుత్పత్తి కేంద్రాన్ని కట్టించింది కేసీఆర్ అని, యాదాద్రి ఆలయాన్ని తీర్చిదిద్ది లక్ష్మీనరసింహస్వామి రుణం తీర్చుకున్నది కేసీఆర్‌అని, మూడు మెడికల్ కళాశాలలు కట్టించింది కూడా కేసీఆరేనని అన్నారు. ఎంజీ యూనివర్శిటీలో పిల్లలకు గొడ్డుకారం పెడుతున్నారని, ఐటీ టవర్ కళతప్పిందని విమర్శించారు. ప్రపంచంలో ఏ శక్తి ప్రజాశక్తి ముందు సాటికాదని, ఆ విషయాన్ని నల్లగొండ రుజువు చేసిందని, ఒకనాడు నియంతను నిలదీసి కొట్లాడిన చరిత్ర నల్లగొండ గడ్డదని అన్నారు. నల్లగొండ కష్టాలపై మాజీ సీఎం కేసీఆర్ స్వయంగా పాటలు రాశారని తెలిపారు. నల్లగొండ జిల్లాలో ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని, పాలిచ్చే ఆవును వదులుకొని ఎగిరితన్నే దున్నపోతును...

- మిగతా 7వ పేజీలో...

రైతుల కోసం పోరాటం : జగదీష్‌రెడ్డి

నల్లగొండ జిల్లాలోని కుక్కమూతిపిందెల వంటి నాయకులకు తాము భయపడేది లేదని, మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాలతో రైతులకు ఊరట కలిగించేందుకు, వారి తరపున పోరాడ తామనే సందేశమిచ్చేందుకే కేటీఆర్ నల్లగొండకు వచ్చారని మాజీమంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. రైతాంగం మద్దతుతోనే తెలంగాణ రాష్ట్ర కల సాకారమైందని, నాడు రాష్ట్రంలో కరెంటు ధరల పెంపును నిరసిస్తూనే కేసీఆర్ రాజీనామా చేసి ఉద్యమం ప్రారంభించారని అన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు బీఆర్‌ఎస్‌కు రైతులే అండగా ఉన్నారన్నారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ చచ్చుడో నినాదంతో రాష్ట్రం సాధించామన్నారు. రాష్ట్రం వచ్చాక ప్రజల కోరిక మేరకు అధికారంలోకి వచ్చి, పదేళ్లు పాలించామని, కేసీఆర్ నేతృత్వంలో రైతును రారాజును చేసి చూపామన్నారు.



ఈ ఖర్చు భరించలేం!

- ఇంటర్ ప్రాక్టికల్, వార్షిక పరీక్షలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని బోర్డు ఆదేశం
- మొత్తం 22 సీసీ కెమెరాలకు రూ.88వేలు
- ప్రభుత్వ బకాయి రూ.63కోట్లు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలగాక భారంగా సాగుతున్న కళాశాలలు

ఇంటర్ కళాశాల యాజమాన్యల పరిస్థితి మూలిగేనక్కపై తాటికాయ పడిన చందంగా మారింది. ఇప్పటికే మూడేళ్లుగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకాక యాజమాన్యాలు ఇబ్బందుపడుతుండగా, ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహణకు ల్యాబ్, వార్షిక పరీక్షల గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఇంటర్ బోర్డు మూడు రోజుల క్రితం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో కెమెరాల ఏర్పాటుకు నిధులు ఎక్కడి నుంచి తేవాలని యాజమాన్యాలు ప్రశ్నిస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి,కోదాడ)

ప్రాక్టికల్స్ పరీక్షకు గదికి మూడు కెమెరాల చొప్పున, వార్షిక పరీక్షలకు గదికి ఒక సీసీకెమెరా ఏర్పాటు చేయాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో 140 కళాశాలలు ఉన్నాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని కళాశాలలకు మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌గా రూ.63కోట్లకు పైగా రావాల్సి ఉంది. ల్యాబ్, వార్షిక పరీక్షల నిర్వహణకు ప్రతీ కళాశాలలో బోర్డు నిబంధనల ప్రకారం 22సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఒక్కోకెమెరాకు రూ.4వేల చొప్పున రూ.88వేలు వ్యయం అవుతుంది.దీంతో యాజమాన్యాలు బావురుమంటున్నాయి. ఇదిలా ఉంటే మొదటిసారి ప్రాక్టికల్ పరీక్షల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని బోర్డు సూచించడం, గూగుల్ జీపీఎస్ ద్వారా డ్యాష్ బోర్డుకు వాటిని అనుసంధానం చేసి, పరీక్షలను పర్యవేక్షించాలని నిర్ణయించడంతో విద్యార్థుల్లో భయం నెలకొంది. విద్యాసంవత్సరం ప్రారంభంలో చెప్పకుండా బోర్డు,పరీక్షల సమయంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని చెప్పడంపై కళాశాల యాజమాన్యాలతోపాటు విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈఏడాది సీసీ కెమెరాల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 140 కళాశాలలు

ఉమ్మడి జిల్లాలో 140 కళాశాలలు ఉన్నాయి. విద్యార్థులు ఆయా కళాశాలల్లో 42వేల మంది

- మిగతా 6వ పేజీలో...

సీసీ కెమెరాలతో రూ.1.20కోట్ల భారం

గతంలో ల్యాబ్, వార్షిక పరీక్షల సమయంలో కళాశాల ఆఫీస్‌లో మాత్రమే ఒక కెమెరా ఉండేది. ఈ ఏడాది మాత్రం ల్యాబ్‌లో మూడు కెమెరాల చొప్పున, ఫిజిక్స్ కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ ల్యాబ్‌లలో మొత్తం 12 కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. వార్షిక పరీక్షలకు 10గదులకు, 10 కెమెరాలు ఏర్పాటు చేయాలని, మొత్తంగా 22 కెమెరాలను ఏర్పాటు చేయాలి. ఒక్కో కెమెరాకు రూ.4వేల చొప్పున, 22 కెమెరాలకు రూ.88వేలు వ్యయం అవుతుంది. మొత్తంగా 140 కళశాలలపై సీసీ కెమెరాల భారం రూ.1.20కోట్లు. దీంతో కళాశాలల యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నాయి.

మునిసిపల్ ప్రత్యేక అధికారిగా అదనపు కలెక్టర్


అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న మునిసిపల్ కమిషనర్లు

రామగిరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ప్రత్యేక అధికారిగా అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు.

విద్యార్థినులు కష్టపడి చదివాలి

న్యాక్ చైర్మన్ పసుమాముల ప్రకాష్


పాటల సీడీని ఆవిష్కరించి మాట్లాడుతున్న న్యాక్ చైర్మన్ డాక్టర్ ప్రకాష్

దేవరకొండ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) చైర్మన్ పసుమాముల ప్రకాష్ అన్నారు. మంగళవారం దేవరకొండ మండలం మైనంపల్లిలోని గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను న్యాక్ బృందం ప్రొఫెసర్ డాక్టర్ సుమతిమోహన్, ప్రొఫెసర్ ఎం.కిషోర్‌నాయక్ బృందం సందర్శించింది. కళాశాలలోని విద్యార్థుల సంఖ్య, వసతులు, మౌలిక సౌకర్యాలు తదితర అంశాలపై ఆరాతీశారు. అనంతరం కళాశాలలో చదివే విద్యార్థినుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటుచేసి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా న్యాక్ చైర్మన్ డాక్టర్ పసుమాముల ప్రకాష్ విద్యార్థినులతో మాట్లాడారు. మూడో సంవత్సరం చదువుతున్న శైలజ రాసి, పాడిన పాట సీడీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.హరిప్రియ, వైస్ ప్రిన్సిపల్ శ్వేత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం

- సర్కారు దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- సాగర్ కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రి తనిఖీ


ఆస్పత్రిలో డాక్టర్ హరికృష్ణను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నాగార్జునసాగర్, జనవరి28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందుతుందని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. మంగళవారం ఆమె సాగర్ కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీచేశారు. ఈ సందర్భంగా అమె ఆసుపత్రిలో వార్డులు, ల్యాబ్‌ను, ఓపీ, క్యాజువాలిటీ, ఎమర్జెన్సీ, ఎంసీహెచ్, తదితర వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె డయాలసిస్ రోగితో అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరికృష్ణతో కలిసి వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్కారు దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాగర్ ఏరియా ఆస్పత్రిలో అధునాతన యంత్ర పరికరాలు, వైద్య సౌకర్యాలున్నాయన్నారు. అనంతరం పాత ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ భానుప్రసాద్ నాయక్, తహసీల్దార్ పావని సరోజ, ఆర్ఐ దండా శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

హాస్టళ్లలో పరిశుభ్రత పాటించాలి

పెద్దవూర: సంక్షేమ వసతిగృహాలు, కేజీబీవీలు, గురుకుల పాఠశాలల్లోని స్టోర్‌రూమ్‌లతోపాటు కిచెన్, డైనింగ్‌హాల్‌లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. మండలంలోని బాలికల గిరిజన సంక్షేమ వసతిగృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. అంతకుముందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీచేశారు. నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవన నిర్మాణాన్ని మార్చిలోపు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. ఆమెవెంట తహసీల్దార్ సరోజ పావని, గిరిజన సంక్షేమ హాస్టల్ సంక్షేమాధికారి తదితరులు ఉన్నారు.

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

కనగల్: ఎరువుల దుకాణాల డీలర్లు యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలుంటాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. మంగళవారం కనగల్ ఎక్స్‌రోడ్డులోని ఓ ఎరువుల దుకాణాన్ని ఆకస్మిక తనిఖీ రికార్డులను పరిశీలించారు. ఈ పాస్ మిషన్‌ద్వారా దుకాణంలోని ఎరువుల నిల్వలను, సరఫరా వివరాలను తెలుసుకున్నారు. అంతకుముందు కనగల్ పీహెచ్‌సీని కలెక్టర్ తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. కనగల్ హైస్కూల్‌లో మరుగుదొడ్లు, అదనపు తరగతి గది పనులను పరిశీలించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ పద్మ, ఎంఈవో పద్మ, డాక్టర్ రామకృష్ణ, డీటీ ఆర్ఐ సునీత, ఏఈవోలు అభిలాష్, నవీన్, హెచ్ఎం విద్యాభార్గవి, కార్యదర్శి వీరబాబు పాల్గొన్నారు.

పాఠాలు బోధించిన కలెక్టర్

కనగల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఇలాత్రిపాఠి తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆమె తొమ్మిదో తరగతి బీ-సెక్షన్ విద్యార్థులకు క్లాస్‌రూంలో పాఠాలను బోధించారు. వారి విద్యాప్రగతిని అంచనా వేశారు. బట్టీ చదువులు కాకుండా, గుణాత్మకమైన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో పద్మ,హెచ్ఎం విద్యాభార్గవి పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని చూసి ఆనందం వ్యక్తం చేసిన కలెక్టర్

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఇక్కడ పనిచేసే ఇంజనీర్లు, ఉద్యోగులు, అధికారులు, సిబ్బందికి వైద్య సేవలు అందించడానికి నాటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ హిల్‌కాలనీలో ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ ఆస్పత్రి నిర్మాణం పూర్తయిన తర్వాత ఆయన కుమార్తె శ్రీమతి ఇందిరాంధి ప్రధాని హోదాలో 1983 డిసెంబరు 6న సాగర్‌లో నిర్మించిన ఏరియా ఆస్పత్రిని ప్రారంభించారు. ఇక్కడ పనిచేసే ఉద్యోగులు నెహ్రూ మీద అభిమానంతో ఆ ఆసుపత్రికి నెహ్రూ సతీమణి కమలా పేరున కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రిగా నామకరణం చేశారు. ఇంతటి గొప్ప చరిత్ర కలిగిన ఆసుపత్రిని తనిఖీ చేయడానికి సాగర్‌కు వచ్చిన కలెక్టర్ ఇలా త్రిపాఠి ఈ ఆసుపత్రిని నాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ప్రారంభించారని తెలుసుకొని, ఆమె ప్రారంభించిన శిలాఫలకాన్ని చూసి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం అక్కడే ఫొటో దిగారు.

ఆడపిల్లలపై వివక్ష వద్దు

డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

నల్లగొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలపై వివక్ష వద్దని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగిన జిల్లాస్థాయి సలహా సమావేశంలో ఆయన మాట్లాడారు. పుట్టబోయేది ఆడబిడ్డ అని తెలియగానే కొన్ని కుటుంబాలు గర్భస్రావానికి సిద్ధపడుతున్నారని, గర్భస్రావం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ స్వరూపరాణి, సుచరిత, స్రవంతి, అరుంధతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్ రెడ్డి, గీత, గ్రామ్యా, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి.. వారానికే ఖాళీ

నిరుపయోగంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్



6

చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు సీఎంకు ఆహ్వానపత్రిక


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం, తదితరులు

నార్కట్‌పల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అతి పెద్ద బ్రహ్మోత్సవాలుగా ప్రాచుర్యం పొందిన నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆహ్వానపత్రికను మంగళవారం అందజేశారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు తొలుత ఆహ్వాన పత్రికలను అందజేసిన వీరేశం అనంతరం మంత్రులతో కలిసి సీఎం రేవంత్‌ను సచివాలయంలోని ఆయన చాంబర్‌లో కలిసి క్షేత్ర ప్రాశస్త్యాన్ని, ఉత్సవ విశేషాలను వివరించారు. దేవస్థాన ప్రధాన పూజారి పోతులపాటి రామలింగేశ్వరశర్మ వారికి ఆశీర్వచనం చేశారు. అంతకుముందు బ్రహ్మోత్సవాల ప్రచార వాల్ పోస్టర్లను మంత్రి వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. వీరి వెంట ఎండోమెంట్ ఏసీ భాస్కర్, దేవస్థాన ఈవో సిరికొండ నవీన్‌కుమార్, కాం గ్రెస్ నాయకులు బత్తుల ఊశయ్య, బండ సాగర్‌రెడ్డి, నేతకాని కృష్ణయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, నల్ల వెంకన్న, అలుగుబెల్లి రవీందర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, సట్టు సత్తయ్య, గడుసు శశిధర్‌రెడ్డి, మేకల వెంకన్న, రేగట్టె నవీన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వారాల రమేశ్, శంకర్, కిట్టు, నాగరాజు ఉన్నారు.

గృహస్తు సోలార్ పవర్ ఉత్పత్తిలో
పోలీస్ దంపతులు టాప్

● రిపబ్లిక్ డేలో పాల్గొనేందుకు కేంద్రం నుంచి ఆహ్వానం

● కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో ముఖాముఖి సంభాషణ



భువనగిరిలో విజయ్‌భాస్కర్ ఇంటిపై ఏర్పాటుచేసిన సోలార్ ప్యానల్స్

భువనగిరి టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్ సీసీఎస్ హెడ్‌కానిస్టేబుల్ పల్లా విజయ్ భాస్కర్‌యాదవ్, పుణ్యావతి దంపతులు కేంద్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు ఢిల్లీ రిపబ్లిక్ డే వేడుకల్లో ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. గృహస్తు సోలార్ పవర్ ఉత్పత్తిలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ నుంచి ఎంపిక చేసిన 16 మందిలో విజయ్‌భాస్కర్ యాదవ్ టాపర్‌గా నిలిచారు. ఈ మేరకు ఈ దంపతులు 24న ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బసలో మూడు రోజుల పాటు ఉన్నారు. 26న ఎర్రకోట వద్ద జరిగిన 76వ గణతంత్ర్య దినోత్సవ పరేడ్‌లో కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక ఆహ్వానితుల గ్యాలరీ నుంచి పరేడ్‌ను వీక్షించారు. అంతేకాక 25న రాష్ట్రపతి భవన్‌లో కేంద్ర, విద్యుత్ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో జరిగిన ముఖాముఖిలో పాల్గొన్నారు. ఇక నుంచి తెలంగాణలో సోలార్ ఎనర్జీ అంబాసిడర్స్‌గా వ్యవహరించాలని మంత్రి సూచించారు. రిపబ్లిక్ డే పేరేడ్, రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీకి అతి సమీపం నుంచి అభివాదం చేసే అవకాశం లభించింది. ఇంటిపైన సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకున్నందుకే ఈ అరుదైన అవకాశం లభించిందని మంగళవారం తెలిపారు.

ఐదు నెలల్లో 578 యూనిట్స్ జెన్‌కోకు సరఫరా



విజయ్‌భాస్కర్, పుణ్యావతి దంపతులు

కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్న రంగాలలో ఒకటి సోలార్ పవర్. ప్రజలందరూ ఎనర్జీ ఉత్పత్తిదారులై దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలంటూ ప్రధాన నరేంద్రమోదీ ప్రభుత్వం పీఎం సూర్యా గర్ ముఫ్త్ బిజిలి యోజన పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ మేరకు విద్యుత్ వినియోగదారులు ఆ పోర్టర్‌లో నమోదు చేసుకొని వినియోగం చేసుకున్న వెంటనే సంబంధిత ఏజెన్సీలు డాక్యుమెంటేషన్ పూర్తి చేసి ఇంటిపై సోలార్ ప్లాంట్‌ను బిగిస్తారు. గత విద్యుత్ వినియోగం ఆధారంగా కిలో వాట్ నుంచి 10 కిలోవాట్ల వరకు ఎంపిక చేసుకునే అవకాశం లబ్ధిదారులకు ఉంటుంది. ఇందుకు ప్రతి కిలోవాట్‌కు సబ్సిడీ మిగతా మొత్తానికి వడ్డీలేని రుణాలను బ్యాంకులు అందిస్తాయి. నెలవారీగా ఈఎంఐలతో రుణాన్ని చెల్లించవచ్చు. ఈ నేపథ్యంలో యాదాద్రిభువనగిరి జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ సీసీఎస్ హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పల్ల విజయ్ భాస్కర్‌యాదవ్ గత ఆగస్టు మొదటి వారంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. సెప్టెంబరు మొదటి నుంచి 3కేవీ సోలార్ యూనిట్ వినియోగంలోకి వచ్చింది. దీంతో అప్పటి వరకు నెలకు రూ.2500 నుంచి రూ.3వేల వరకు చెల్లించే విద్యుత్ బిల్లు భారం తప్పింది. అంతేకాక ఐదు నెలల్లో గృహ అవసరాల కోసం 700 యూనిట్లను వినియోగించుకోగా మరో 578 యూనిట్లను ఉత్పత్తి చేసి జెన్‌కోకు సరఫరా చేశారు. దీంతో రాష్ట్రంలోనే అధిక గృహస్తు సోలార్ ఎనర్జీని ఉత్పత్తి చేసిన 16 మందిలో విజయ భాస్కర్‌యాదవ్ ప్రథమస్థానంలో నిలిచారు. దీంతో సోలార్ విద్యుత్‌కు ప్రచారం కల్పించే లక్ష్యంతో గణతంత్ర్య దినోత్సవంలో పాల్గొనే అవకాశం తెలంగాణ నుంచి 16 మంది వినియోగదారులకు కేంద్రం కల్పించింది. ఉమ్మడి జిల్లా నుంచి 76వ గణతంత్ర్య దినోత్సవం ఢిల్లీ పరేడ్‌లో పాల్గొన్న విజయ్ భాస్కర్, పుణ్యావతి దంపతులను పలువురు అభినందించారు.

అంతర్జాతీయ స్థాయి.. వారానికే ఖాళీ

● నిరుపయోగంగా ఇంటిగ్రేటేడ్ మార్కెట్


● వారం పాటు కూరగాయల విక్రయాలు

● ఆ తర్వాత ఆసక్తి చూపని చిరువ్యాపారులు

● ఆరుబయటనే వ్యాపారాలు

చిరు వ్యాపారులందరినీ ఒకే దగ్గరకు చేరి వ్యాపారాలు నిర్వహించేందుకు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పాత వ్యవసాయ మార్కెట్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిరుపయోగంగా మారింది. రూ.కోట్లు వెచ్చించిన ఈ భవనం ప్రారంభించిన కొన్నాళ్లకే మూతపడింది. కేవలం వారం రోజులు మాత్రమే కూరగాయలు విక్రయించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించినప్పటికీ ప్రజల, వ్యాపారులను ఆకట్టుకోలేకపోయారు. దీంతో వ్యాపారులు తిరిగి మార్కెట్‌లోని ఆరుబయట యథాస్థలాల్లోనే విక్రయాలు జరుపుతున్నారు. దీంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ లక్ష్యం నెరవేరకుండా పోయింది. రెండేళ్లుగా మార్కెట్ ఖాళీగా ఉంటోంది.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట(కలెక్టరేట్)



అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన ఇంటిగ్రెటెడ్ మార్కెట్‌కు వేసిన తాళం

సూర్యాపేటలోని మార్కెట్‌రోడ్‌లో కూరగాయలు విక్రయాలు ఆరుబయటనే జరుగుతుంటాయి. రహదారి ఇరుకుగా ఉండటంతో వ్యాపారులతో పాటు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అప్పుడప్పుడు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యేవి వీటిన్నంటిని దృష్టిలో పెట్టుకుని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నిసౌకర్యాలతో కూడిన ఇంటిగ్రెటెడ్ మార్కెట్‌ను అందుబాటులోకి తేవాలని ఆలోచన చేశారు. అందులో భాగంగా రూ.11 కోట్ల పైచిలుకు మునిసిపల్ నిధులు, సుమారు రూ.19.50 కోట్ల మార్కెటింగ్‌శాఖ నిధులు కలిపి సుమారు రూ.30 కోట్లతో ఇంటిగ్రెటెడ్ మార్కెట్‌లో నిర్మాణానికి రూపకల్పన చేయించి 2017లో పనులు ప్రారంభించారు. 2023లో అప్పటి సీఎం కేసీఆర్ ఈ భవనాన్ని ప్రారంభించారు.

అన్నీ ఒక చోటే లభ్యమయ్యేలా...

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లోని దుకాణాలను కూరగాయలు, పండ్లు, పూలు, చికెన్, కిరాణం, ఇతర నిత్యావసరాల విక్రయించే వ్యాపారులకు కేటాయించారు. జిల్లా కేంద్రంలో రహదారి విస్తరణతో దుకాణాలు కోల్పోయిన వారికి ఈ మార్కెట్‌లో దుకాణాలు కేటాయించారు. చాలామంది చిన్న వ్యాపారులు పట్టణంలోని రోడ్లపైనే పండ్లబండ్లు పెట్టి విక్రయాలు జీవనం సాగిస్తారు. వారికి కూడా బండ్లు పెట్టి పండ్లు విక్రయించేలా మార్కెట్‌ను డిజైన్ చేశారు.

కొనుగోలుదారులు రాకపోవడంతో...

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రారంభించిన సమయంలో వారం పాటు కూరగాయల విక్రయాలు జరిగాయి.అయితే మార్కెట్‌లోకి ప్రజలు ఎవరూ వెళ్లలేదు. దీంతో వ్యాపారం దెబ్బతింటుండటంతో వారం తర్వాత మార్కెట్‌ను వ్యాపారులు ఖాళీ చేశారు. ఎప్పటి మాదిరిగానే రోడ్లపైనే విక్రయాలు చేయగా మునిసిపల్ అధికారులు బలవంతంగా మార్కెట్‌లోకి పంపించేందుకు ప్రయత్నాలు చేసినప్పటికి సాధ్యపడలేదు. దీంతో అప్పటి నుంచి మార్కెట్‌లో ఎలాంటి వ్యాపారాలు జరగడం లేదు. దీంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనానికి తాళం వేశారు.

ఇతర పట్టణాల్లో నిర్మించిన మార్కెట్ల పరిశీలన

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిరుపయోగంగా ఉండడంతో దానిని వినియోగంలోకి తెచ్చేందుకు కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్ ప్రత్యేకచొరవ తీసుకున్నారు. మార్కెట్ వ్యాపారులకు అనువుగా లేదని పలువురు చెప్పడంతో ఇతర పట్టణాల్లో నిర్మించిన మార్కెట్లను సందర్శించి వారు ఏవిధంగా నిర్మించారో పరిశీలించాలని ఆదేశించారు. దీంతో మునిసిపల్, మార్కెటింగ్ శాఖ అధికారులు, వ్యాపారులు కొందరు గజ్వేల్, సిద్ధిపేట,సిరిసిల్లలో నిర్మించిన మార్కెట్లను సందర్శించారు. అక్కడ వారు నిర్మించిన నమూనాలను పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. మార్కెట్‌ను అందుబాటులోకి తెచ్చి దానిద్వారా ఆదాయం పొందాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఆ కార్యాచరణ ఇంకా కార్యరూపం దాల్చలేదు.

అనువుగా నిర్మించలేదు



వ్యాపారులకు అనువుగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించలేదు. నిర్మాణ సమయంలో వ్యాపారులతో సంప్రదింపులు జరిపితే బాగుండేది. కూరగాయలు విక్రయించే వారికి గాలి, వెలుతురు ఉండడంతో పాటు ఓపెన్‌గా ఉంటే బాగుంటుంది. భవనం మార్పులు చేసి, ప్రహరీలను కూల్చి వేస్తే విక్రయాలు బాగా జరుగుతాయి.

వెలుగు వెంకన్న, 48వార్డు కౌన్సిలర్, హోల్‌సేల్ కూరగాయల వ్యాపారి, సూర్యాపేట.

అంతర్జాతీయ డిజైన్లతో రూపకల్పన

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను పర్యావరణ పరిక్షణకు అనుగుణంగా, దేశంలోనే ప్రభుత్వం నిర్మించిన వాటిలో ఆధునీకరణ పద్ధతుల్లో చేపట్టారు. మార్కెట్‌లోని దుకాణాల్లో పగలు వెలుతురు కోసం లైట్లు వేయాల్సిన అవసరం లేదు. రాత్రిపూట మాత్రమే లైట్లు అవసరమవుతాయి. వెలుతురు పుష్కలంగా వచ్చేలా అంతర్జాతీయ నమునాతో మార్కెట్ నిర్మించారు. సూర్యాపేట పాత వ్యవసాయ మార్కెట్ 22 ఎకరాలు ఉండగా 11 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించారు. 1.35 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంతో భవన నిర్మాణం జరిగింది. యూ ఆకారంలో ఈ భవనాన్ని నిర్మించారు. ప్రతీ పిల్లర్‌కు మరో పిల్లర్‌కు మధ్య ఎనిమిది మీటర్ల దూరం ఉంటుంది. దీంతో గాలి, వెలుతురు నిరాటంకంగా వస్తుంది. జీప్లస్ వన్ తరహాలో నిర్మించారు. గ్రౌండ్, మొదటి అంతస్తు కలిపి 168 దుకాణాలు నిర్మించారు.

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది



సూర్యాపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్ విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. మార్కెట్‌లో విక్రయాలకు కూరగాయల వ్యాపారులు సుముఖత చూపడం లేదు. ఇతర వ్యాపారులు కూడా ముందుకు రాలేదు. ఇటీవల కలెక్టర్ ఆదేశాల మేరకు గజ్వేల్, సిద్ధిపేటలో నిర్మించిన మార్కెట్లను పరిశీలించాం. దానికి సంబంధించిన వివరాలను కలెక్టర్‌కు నివేదించాం. త్వరలో మార్కెట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టనున్నారు.

శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్ సూర్యాపేట.

కొత్త కోర్సులతో భవిత భద్రం

● డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుకుంటూనే సంపాదన



భువనగిరి టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించే లక్ష్యంతో రెండేళ్ల క్రితం రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రారంభించిన నూతన డిగ్రీ కోర్సుల ఫలాలను విద్యార్థులు అందిపుచ్చుకుంటున్నారు. తృతీయ సంవత్సరం చదువుకుం టూనే నెలకు రూ.25వేల వరకు సంపాదించుకుంటున్నారు. దీంతో విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు ఆర్థిక స్వాలంబన అవకాశాలు ఏర్పడ్డాయి. ఉన్నత విద్యలో చేపట్టిన సంస్కరణలో భాగంగా ఉన్నత విద్యామండలి డిగ్రీలో బీబీఏ లాజిస్టిక్ కోర్సును అమల్లోకి తెచ్చింది. ఈ మేరకు మహాత్మాగాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ)పరిధిలో యాదాద్రి జిల్లా కేంద్రం భువనగిరిలోని జాగృతి డిగ్రీ, పీజీ కళాశాలలో మాత్రమే బీబీఏ లాజిస్టిక్ కోర్సును రెండేళ్ల క్రితం ప్రారంభించారు. దీంతో ఆ కోర్సులో చేరిన 15మంది విద్యార్థులు ఇటీవల రెండు సంవత్సరాల అకాడమిక్ కళాశాలలోనే పూర్తి చేయగా మూడో సంవత్సరం కోర్సును వివిధ రంగాల్లో రవాణా విభాగంలో ఇంటెన్షన్‌షిప్ పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇటీవల నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఆ 15 మంది విద్యార్థులు హైదరాబాద్‌లోని పలు ఎంఎన్‌సీ కంపెనీలకు ఎంపికయ్యారు. వారందరికీ ఆయా కంపెనీలు ఇంటెన్షన్‌షిప్ కాలానికి నైపుణ్యం ఆధారంగా నెలకు రూ.7,500 నుంచి 25వేల వరకు గౌరవ భృతిని చెల్లించనున్నాయి. ఇంటెన్షన్‌షిప్ సమయంలో చూపే నైపుణ్యం ఆధారంగా ఆయా సంస్థలు లేదా ఇతర రవాణా రంగాల్లో శాశ్వత ఉద్యోగాలకు ఎంపికయ్యే అవకాశాలుంటాయి. నూతన కోర్సులతో విద్యార్థి దశలోనే ఉద్యోగ అవకాశాలు లభించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పరిస్థితులకు అనుగుణంగా నూతన కోర్సులు

ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి నూతన కోర్సులు ప్రవేశపెడుతుండడం అభినందనీయం. పెరుగుతున్న టెక్నాలజీ ప్రాధాన్యం, ఏఐ తదితర నవతరానికి అనుగుణంగా కోర్సులను విద్యలో ప్రవేశపెట్టాలి. ఇందుకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలి.

డాక్టర్ బీ సూర్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపల్, జాగృతి డిగ్రీ, పీజీ కళాశాల భువనగిరి



● భవిష్యత్తుపై భరోసా వచ్చింది



బీబీఏ లాజిస్టిక్ కోర్సుతో భవిష్యత్తు పై భరోసా వచ్చింది. తృతీయ సంవత్సరంలోనే ఇంటెన్షిప్ పేరిట ఎంఎన్‌సీ సంస్థలో పనిచేసే అవకాశం లభించడం సంతోషంగా ఉంది. విద్యార్థి దశలోనే గౌరవభృతి లభిస్తుండటంతో ఖర్చుల కోసం పేరెంట్స్‌పై ఆధారపడే పరస్థితి తప్పింది.

ఎన్ భవ్య రాఘవి, విద్యార్థిని

● చదువుతో పాటు ఉద్యోగం



రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రవేశపెట్టిన బీబీఏ లాజిస్టిక్ కోర్స్‌తో విద్యార్థి దశలోనే ఉద్యోగం లభించినట్టుగా ఉన్నది. ఈ తరహా కోర్సులను మరిన్ని ప్రవేశపెట్టి విద్యార్థి దశలోనే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. ఫలితంగా విద్యార్థులలో భవిష్యత్తుపై ఆందోళన తప్పుతుంది.

కె భరత్‌కుమార్, విద్యార్థి

అమరవరం జాతరకు వైభవంగా నిర్వహించాలి

జాతరకు రూ.25 లక్షలు మంజూరు: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మంత్రి ఉత్తమ్‌ను కలిసిన అమరవరం లింగమంతుల స్వామి ఆలయ కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్ రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం అమరవరం గ్రామంలోని లింగమంతుల జాతరను అత్యంత వైభవంగా నిర్వహించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో జాతర కమిటీ ఆధ్వర్యంలో ఉత్తమ్‌ను కలిసి లింగమంతుల జాతరకు ఆహ్వానించారు. దీంతో మంత్రి ఉత్తమ్ జాతర నిర్వహణ, అభివృద్ధి పనులకు డీఎంఎఫ్‌టీ నిధులు రూ.25 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ అమరవరం గట్టును మరింత అభివృద్ధి చేస్తామన్నారు. జాతరకు కూడా హాజరవుతానని తెలిపినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మద్దుల కృష్ణ, రమేష్, ఉస్తెల శ్రీనివాస్‌రెడ్డి, కర్నాటి వీరనాగిరెడ్డి, మాజీ సర్పంచ్ గుర్వారెడ్డి, అన్నెం శౌరిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, చక్కెర వీరారెడ్డి, దొంగరి సత్యనారాయణ, నిజాముద్దీన్, రజాక్, శ్రీనివాస్, బాలకృష్ణ, సైదా, ఇందర్‌రావు, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక ప్రభుత్వం కాంగ్రెస్

సూర్యాపేట(కలెక్టరేట్), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమని రాజ్యసభ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి నల్లగొండలో జరిగే రైతు మహాధర్నాకు తరలివెళ్లే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. రైతుభరోసాను కావాలనే కొర్రీలు పెట్టి ఆలస్యం చేస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జీవన్‌రెడ్డి, ఉప్పల ఆనంద్, పుట్ట కిషోర్, బూర బాలసైదులుగౌడ్, మడిపల్లి విక్రమ్, తూడి నర్సింహారావు, యాదగిరి గౌడ్, జానియాదవ్, రమేష్ పాల్గొన్నారు.

నేరేడుచర్ల: నల్లగొండలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ రైతు మహాధర్నాకు నేరేడుచర్ల నుంచి భారీ స్థాయిలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో నాయకులు దొండపాటి అప్పిరెడ్డి, నాగండ్ల శ్రీధర్, చిత్తలూరి సైదులు, బొడ్డుపల్లి సుందరయ్య, చెన్నబోయిన సైదులు, పిచ్చిరెడ్డి, వెంకన్న, రాజేష్ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రి నిర్వాహకులతో యువకుల ఘర్షణ

● యువకులకు దేహశుద్ధి చేసి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన ఆర్ఎంపీ అనుచరులు



ఆర్ఎంపీ బాబు వైద్యశాల వద్ద ఘర్షణ పడుతున్న యువకులు

హుజూర్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ఓ ఆసుపత్రి వారితో యువకులు ఘర్షణకు దిగారు. దీంతో ఆ యువకులకు దేహశుద్ధి చేసి నిర్వాహకులు పోలీసులకు అప్పగించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హుజూర్‌నగర్‌లోని మఠంపల్లి రోడ్డులో ఆర్ఎంపీ బాబు నలభై ఏళ్లుగా వైద్యసేవలు అందిస్తున్నారు. కాగా మంగళవారం సూర్యాపేట ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకులు కారులో వైద్యశాల వద్దకు వెళ్లి ఆర్ఎంపీ బాబును డబ్బులు ఇవ్వాలని, తాము విలేకరులమని, బీసీ సంఘంలో పనిచేస్తామని బెదిరించారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. బాధితుడు బాబు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆర్ఎంపీని బెదిరించిన యువకులను పోలీసులు విచారించినట్లు తెలిసింది. బాధితుడు ఆర్ఎంపీ బాబు తెలిపిన వివరాల ప్రకారం కోదాడ పట్టణంలోని స్నేహ నర్సింగ్ కళాశాలకు సంబంధించి షేక్ ఖాసీంకు, తనకు కొంతకాలంగా వివాదం నడుస్తోందన్నారు. దానికి సంబంధించి పథకం ప్రకారం షేక్ ఖాసీం,షేక్ ఇమ్రాన్, షేక్ అజహర్‌బాబాతో కలిసి తనను హత్య చేసేందుకు సూర్యాపేట ప్రాంతంలోని ఆత్మకూర్‌కు చెందిన బయ్యా రాజేష్, అర్వపల్లికి చెందిన మహేష్‌చారి, మోతె మండలం సర్వారం గ్రామానికి చెందిన వీరబోయిన లింగయ్య మంగళవారం సాయంత్రం తన ఆసుపత్రి వద్దకు వచ్చి ఘర్షణ పడ్డారని తెలిపారు. ఎంబీబీఎస్ పట్టా లేకుండా ఎంతోమంది పిల్లల చావుకు కారణమయ్యారని, నీకు ఎవరు పర్మిషన్ ఇచ్చారని ఆ యువకులు బెదిరించి తనపై హత్యాయత్నానికి పాల్పడ్డారని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా ఇరువురి మధ్య ఘర్షణ జరగ్గా ఆర్ఎంపీ బాబు అనుచరులు ముగ్గురు యువకులపై దాడి చేసినట్లు తెలిసింది. కాగా ఈ సమయంలోనే ఆర్ఎంపీ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం బాబు ఆ యువకులపై పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. కాగా ఈ సంఘటనపై ఎలాంటి కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు.

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

గుర్రంపోడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం వట్టికోడు సమీపంలో మంగళవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ పసుపులేటి మధు తెలిపారు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ట్రాన్స్‌పోర్ట్ ఆటో అనుమానాస్పదంగా కనిపంచడంతో పోలీసులు తనిఖీ చేశారు. ఆటోలో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యమయ్యాయి. నాంపల్లి మండలం నర్సింహులగూడెం గ్రామానికి చెందిన గంట వెంకన్న అనే వ్యక్తి మండలంలోని బోడపాడు నుంచి రేషన్ బియ్యం తీసుకెళ్తున్నట్లు విచారణలో తేలింది. రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ మధు హెచ్చరించారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఆందోళన



కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేస్తున్న సరిత(రౌండప్‌లో)

సూర్యాపేటటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నాభర్త నాకు కావాలంటూ సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ మహిళ ఆందోళనకు చేపట్టింది. తొమ్మిదవ వార్డుకు చెందిన భూపతి సరిత(రాజేశ్వరీ) మంగళవారం ఆమె అత్తింటి ముందు ఆందోళన చేపట్టింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023 ఫిబ్రవరి 10వ తేదీన జిల్లా కేంద్రంలోని 9వార్డుకు చెందిన భూపతి నరేందర్‌తో తన వివాహం జరిగిందన్నారు. నరేందర్ తండ్రి మరణాంతరం ఆయన కండక్టర్ ఉద్యోగం తన భర్తకు వచ్చిందన్నారు. యాదగిరిగుట్ట డిపోలో నాలుగు నెలల కిందట ఉద్యోగంలో చేరారన్నారు. ఉద్యోగం వచ్చిన తర్వాత మరో వివాహం చేసుకుంటానని తనను నిత్యం వేధిస్తున్నాడని తెలిపింది. అదనపు కట్నం కోసం అత్తా, మరిది, అత్త తమ్ముడు తనను మూడునెలలుగా చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలల నుంచి తమ అమ్మవారింటిలో ఉంటున్నట్లు తెలిపింది. తాళం వేసుకుని అత్త కుటుంబ సభ్యులు వెళ్లిపోవడంతో తాళం పగులగొట్టి ఇంట్లోకి వెళ్లింది. కొద్దిసేపటికి పోలీసులు రావాలని సూచించడంతో ఆందోళన విరమించి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. అధికారులు తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

వ్యక్తి అదృశ్యం



యాదగిరి

అడ్డగూడూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. మండలంలోని చిర్రగూడూరు గ్రామానికి చెందిన చేగోని యాదగిరి(55) ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకి వెళ్లాడు. మండలంలోని చౌళ్లరామారం గోదాం వద్ద మోత్కూరుకు వెళ్లే ఆటో ఎక్కినట్లుగా స్థానికులు గమనించారు. ఆ తర్వాత నుంచి అతడి ఆచూకీ లేదని కుటుంబసభ్యులు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఫ్లైయాష్ ట్యాంకర్ బోల్తా

గరిడేపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామశివారులో ఫ్లైయాష్ ట్యాంకర్ బోల్తా పడింది. ఈ ఘటన మంగళవారం మధ్యాహ్నం జరిగింది. ఖమ్మం జిల్లా పాల్వంచ నుంచి జాన్‌పహాడ్ దక్కన్ సిమెంట్ పరిశ్రమ నుంచి ఫ్లైయాష్ లోడ్‌తో వెళ్తున్న టీఎస్28టీబీ 1679 ట్యాంకర్ మార్గమధ్యలోని కీతవారిగూడెం గ్రామశివారులోకి రాగానే స్టీరింగ్ పట్టేసింది. చిలుకూరు మండల కేంద్రానికి చెందిన డ్రైవర్ సాయి అప్రమత్తంగా వ్యవహరించి లారీని ఎదురుగా ఉన్న కాల్వ కల్వర్టుకు ఢీకొట్టాడు. ఈ క్రమంలో రోడ్డు పక్కకు వచ్చి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్ అప్రమత్తతో ఎలాంటి తప్పింది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

ఈ ఖర్చు భరించలేం!

(5వ పేజీ తరువాయి)

విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఒక్కో విద్యార్థికి ఫీజురీయింబర్స్‌మెంట్ కింద ప్రభుత్వం రూ.5వేలు ఇవ్వాల్సి ఉంది. ఆ లెక్కన ఏడాదికి రూ.21కోట్లు, మూడేళ్లుగా ఉమ్మడి జిల్లాలోని 140 కళాశాలలకు రూ.63కోట్ల బకాయి ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

భయపడుతున్న విద్యార్థులు

ఫిబ్రవరి 3 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్, మార్చి 5నుంచి వార్షిక పరీక్షలకు బోర్డు షెడ్యూల్ విడుదల చేసింది. కాగా, ల్యాబ్, వార్షిక పరీక్షలను సీసీ కెమెరాల నడుమ నిర్వహించాలని బోర్డు నిర్ణయించడంపై విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా చర్యలు తీసుకుంటామని బోర్డు పేర్కొనగా, విద్యార్థుల్లో భయాందోళన నెలకొంది. పరీక్షల ముందు బోర్డు తీసుకున్న నిర్ణయంతో చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రభావం పడుతుందని కళాశాలల యాజమాన్యాలు పేర్కొంటున్నాయి.

పరీక్షలకు ముందు నిర్ణయం సరికాదు

పరీక్షలు వారం రోజుల్లో ఉండగా, బోర్డు సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించడం కళాశాలలకు భారంగా ఉంటుంది. అంతేగాక విద్యార్థులు సీసీ కెమెరాల నడుమ పరీక్షలు రాయాలంటే భయపడతారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో చెబితే విద్యార్థులు అలవాటు పడేవారు. ఇప్పటికైనా ఇంటర్‌బోర్డు సీసీ కెమెరాల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. కళాశాలలపై భారం, విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని తొలగించాలి.

గద్దె రఘు, ప్రైవేట్ కళాశాల ప్రిన్సిపాల్, కోదాడ

ఇసుక టిప్పర్ల పట్టివేత

కోదాడ రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో ఇసుక టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కూచిపూడి మీదుగా హుజూర్‌నగర్‌కు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక టిప్పర్లను పట్టుకున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి జోరుగా ఇసుక టిప్పర్లు తెలంగాణకు వస్తున్నాయి. అందులో భాగంగా మంగళవారం ఉదయం జగ్గయ్యపేట మీదుగా అన్నవరం, కాపుగల్లు మీదుగా హుజూర్‌నగర్‌కు తరలివెళ్తుండగా, కాపుగల్లు వద్ద రెండు టిప్పర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. డ్రైవర్లు జక్కంపూడి నరేష్, యనద్రపల్లి అనిల్, ఓనర్లపై కేసు నమోదు చేశామన్నారు.

తమ్మరలో ఇసుక ట్రాక్టర్..

అనంతగిరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ నవీన్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేట మండలం, మల్కాపురం గ్రామానికి చెందిన బోయిళ్ల నాగరాజు, భూక్యా రమేష్‌లు ఇద్దరు కలిసి తమ ట్రాక్టర్‌లో ఇసుకను నింపుకుని కోదాడకు వస్తున్నారు. తమ్మర వద్ద పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

దమ్ముంటే సభ పెట్టి..
ఏం చేశారో చెప్పండి

(5వపేజీ తరువాయి)

తెచ్చిమీదపెట్టుకున్నామని బాధపడుతున్నారని అన్నారు. నల్లగొండ జిల్లాలో తాగునీటి ఇబ్బందికి, పిల్లల ఎముక మూలుగ చచ్చిపోవడానికి, రైతుల అవస్థలకు కాంగ్రెస్సే కారణమని విమర్శించారు. ఏడాది కాలంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండకు చేసిందేమీ లేదని అన్నారు.

నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలతో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నివర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని అన్నారు. రైతుభరోసా, రుణమాఫీ, రైతుబీమా ఏ పథకమూ రైతులకు సక్రమంగా ఇవ్వడం లేదని ఆరోపించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ మహా ధర్నాలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, మహమూద్ అలీ, సత్యవతిరాథోడ్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, గాదరికిషోర్‌కుమార్, పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీత, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి, నోముల భగత్, చిరుమర్తి లింగయ్య, బొల్లం మల్లయ్యయాదవ్, కర్నె ప్రభాకర్, నాయకులు బండా నరేందర్‌రెడ్డి, చాడా కిషన్‌రెడ్డి, గొంగిడి మహేందర్‌రెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి, క్యామ మల్లేశ్, పాల్వాయి స్రవంతి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దుర్గెంపూడి నారాయణరెడ్డి, దూదిమెట్ల బాలరాజ్‌యాదవ్, మాలె శరణ్యారెడ్డి, రావుల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భారీ ర్యాలీ

బీఆర్‌ఎస్ మహాధర్నా సందర్భంగా నల్లగొండలో భారీ ర్యాలీ నిర్వహించారు. నల్లగొండ ఎన్జీ కళాశాల నుంచి గడియారం చౌరస్తా వరకు పార్టీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించా రు. ఓపెన్ టాప్ జీప్ నుంచి మాజీ మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి కార్యకర్తలకు అభివాదం చేశా రు. గడియారం చౌరస్తా వద్ద బత్తాయిలతో చేసిన గజమాలను క్లాక్‌టవర్ వద్ద మాజీ మంత్రులకు అలంకరించారు.

ఫలించిన జగదీష్‌రెడ్డి వ్యూహం

వరుసగా రెండు పర్యాయాలు వాయిదా పడడం, చివరకు హైకోర్టు జోక్యంతో మంగళవారం నల్లగొండలో నిర్వహించిన మహాధర్నా విజయవంతం కావడంతో బీఆర్‌ఎస్ నేతల్లో నూతన ఉత్సాహం వచ్చింది. హైకోర్టు నుంచి అనుమతి సాధించడం నుంచి, ధర్నా విజయవంతమయ్యేంతవరకు మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరించి మాజీ ఎమ్మెల్యేలు, క్యాడర్‌ను సమాయత్తం చేశారని, దీంతో నిర్దేశిత సమయానికి ధర్నా విజయవంతంగా సాగిందని పార్టీ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల మేరకు మధ్యాహ్నం 2గంటలకే ధర్నాను ముగించారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఉమ్మడి జిల్లాలో తీసుకున్న మొదటి కార్యక్రమం కావడంతో దీన్ని విజయవంతం చేయాలనే సంకల్పంతో మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు ప్రణాళికాయుతంగా పనిచేశారు. అన్ని నియోజకవర్గాల నుంచి రైతులు స్వచ్ఛందంగా తరలిరావాలని కోరడంతో పాటు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు ఉదయం 11గంటలకే ధర్నా వేదిక వద్దకు చేరారు. కేటీఆర్ ప్రసంగానికి ఉత్సాహంగా చప్పట్లు కొట్టారు.



కేటీఆర్‌కు ఘనస్వాగతం

- భారీ కాన్వాయ్‌తో కేటీఆర్
- పెద్దకాపర్తిలో జెండావిష్కరణ

చిట్యాలరూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ రాష్ట్రకార్యనిర్వాహక అధ్యక్షుడు మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు మంగళవారం చిట్యాల మండలం పెద్దకాపర్తిలో పార్టీ జెండావిష్కరణకు హాజరై జెండావిష్కరణ చేశారు. నల్లగొండలో జరిగే ధర్నా వెళ్తున్న కేటీఆర్ మార్గమధ్యలో పెద్దకాపర్తిలో ఆ గి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేటీఆర్‌కు స్వాగతం పలికేందుకు మండలంలోని గ్రామాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు కేటీఆర్ కారు దిగగానే సీఎం... సీఎం... అంటూ కేటీఆర్‌నుద్దేశించి నినాదాలు చేశారు. అందుకు కేటీఆర్ నవ్వుతూ అభివాదం చేసుకుంటూ ముందుకెళ్లారు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కేటీఆర్‌కు స్వాగతం పలికారు. ఆయనతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేశారు. కారులో వెళుతూ కార్యకర్తలతో సెల్ఫీలు దిగుతూ వెళ్లారు. పెద్దకాపర్తిలో జెండావిష్కరణ కార్యక్రమానికి కేటీఆర్ వస్తున్నందున మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మహమూద్ అలీ వచ్చారు. జెండావిష్కరణ కార్యక్రమం అనంతరం కాన్వాయ్‌తో నల్లగొండలో జరిగే ధర్నాకు తరలివెళ్లారు. కేటీఆర్ పెద్దకాపర్తి రాగానే నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ నెట్టుకుంటూ ముందుకు వెళ్తుండగా జాగ్రత్త...జాగ్రత్త అని కార్యకర్తలకు చెప్పారు.

విద్యార్థుల సమస్యలపై ఫైట్ చేస్తా..



ఎంజీయూ విద్యార్థులతో కేటీఆర్

నల్లగొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ యూనివర్సిటీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఫైట్ చేయడంతోపా టు విద్యార్థుల ఇబ్బందులను గవర్నర్ దృష్టికి తీసుకెళ్తానని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. మంగళవారం నల్లగొండలో జరిగిన రైతు ధర్నాకు హైదరాబాద్ నుంచి వచ్చే సమయంలో ఎంజీయూ వద్ద విద్యార్థుల విజ్ఞప్తితో ఆగారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో హైకోర్టు మధ్యాహ్నం 2గంటల వరకే సమయం ఇచ్చినందున తిరిగి వెళ్లేటప్పుడు ఆగి మీ సమస్యలు వింటానని చెప్పారు. ఇచ్చిన మాట మేరకు రైతుధర్నా ముగిసిన తరువాత మధ్యాహ్నం 3గంటలకు నల్లగొండ నుంచి హైదరాబాద్ వెళ్లే సమయంలో యూనివర్సిటీ వద్ద ఆగి విద్యార్థులతో మాట్లాడటంతోపాటు వినతిపత్రం తీసుకున్నారు. ప్రధానంగా విద్యార్థుల హాజరు విషయంతో పాటు యూనివర్సిటీలో అభివృద్ధి, నాణ్యమైన ఆహారం, నెల రోజులపాటు పరీక్షలు వాయిదా విషయాన్ని మాజీ మంత్రి కేటీఆర్‌కు తెలిపారు. అదేవిధంగా యూనివర్సిటీలో వీసీ నియంతృత్వ పోకడలు, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న తీరు గురించి తెలిపారు. యూనివర్సిటీకి మంచి రోజులు వస్తాయని, తాను విద్యార్థుల సమస్యల గురించి గవర్నర్‌తో చర్చిస్తానని వివరించారు. అయితే మాజీ మంత్రి కేటీఆర్‌ను యూనివర్సిటీలోకి రావాలంటూ కోరగా మరోసారి వస్తానని నచ్చజెప్పారు. మరొకసారి అనుమతి తీసుకునే యూనివర్సిటీకి వచ్చి సమస్యలు అన్ని వింటానని పేర్కొన్నారు. అప్పటికే పోలీసులు యూనివర్సిటీ వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.





భక్తిశ్రద్ధలతో శంభులింగేశ్వర స్వామి మాసకల్యాణం



మేళ్లచెర్వు: మాసకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

మేళ్లచెర్వు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మాసశివరాత్రి సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి అర్చకులు భక్తిశ్రద్ధలతో స్వామి వారి మాసకల్యాణం నిర్వహించారు. మాసశివరాత్రి సందర్భంగా మంగళవారం వేకువజామునే స్వామి వారికి మహాన్యాస రుద్రాభిషేకాలు, నీరాజన మంత్రపుష్పాలు, సమర్పించి, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో, భజన కోలాటాలతో ఆలయ ప్రాంగణంలో కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శంభిరెడ్డి, అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, పాలకమండలి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలోనూ...

మఠంపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో స్వామి వారి నిత్యకల్యాణాన్ని భక్తుల ఆధ్వర్యంలో మంగళవారం వేద పండితులు కన్నులపండువగా నిర్వహించారు. ఆలయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం కల్యాణ మహోత్సవం వైభవంగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



మఠంపల్లిలో కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

ఇంటర్ ప్రాక్టికల్స్ సామగ్రి పంపిణీ

భానుపురి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలకు సంబంధించిన సామగ్రిని సంబంధిత కళాశాలలకు పంపిణీ చేశామని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి భానునాయక్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్స్ సామగ్రిని అన్ని కళాశాలలకు పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 74 కళాశాల్లోని విద్యార్థులు ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. 44 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశామని, అన్నికేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నేటి నుంచి

ఈ నెల 29న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, 30న ఎన్విరాన్‌మెంట్ పరీక్ష, 31న ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్స్, ఫిబ్రవరి 1న ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్స్ ఉంటాయని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి భానునాయక్ తెలిపారు. ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఉంటాయని, ప్రాక్టికల్స్ పరీక్షలను సీసీ కెమెరాల నడుమ నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

మహా ధర్నాలో దొంగల చేతి వాటం

- చైన్లు, సెల్‌ఫోన్లు చోరీ
- ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సెల్‌ఫోన్ సైతం అపహరణ
- దొంగను అదుపులోకి తీసుకున్న పోలీసులు



క్లాక్‌టవర్ సెంటర్‌లో నిర్వహించిన రైతు మహాధర్నాలో కార్యకర్తల రద్దీ

నల్లగొండ క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాకేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన రైతు మహాధర్నాలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. చైన్లు, సెల్‌ఫోన్లు అపహరించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తల ముసుగులో ఎన్జీ కళాశాల సర్కిల్ నుంచి కార్యకర్తలతో కలిసి ర్యాలీలో కలిసి నడిచారు. ఓ మహిళతో పాటు మరో ఐదుగురు వ్యక్తుల వద్ద బంగారు చైన్లు, ఇద్దరి సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. మొత్తం సుమారు పదిన్నర తులాల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. ఎన్జీ కళాశాల వద్ద నల్లగొండ పట్టణానికి చెందిన అనిరెడ్డి లక్ష్మారెడ్డి మెడలో ఉన్న ఒకటిన్నర తులాల బంగారు గొలుసును దొంగలు లాక్కెళ్లారు. మహాధర్నా వద్ద రద్దీగా, పెద్దఎత్తున కార్యకర్తలు ఉండడాన్ని గమనించిన దొంగలు దుప్పలపల్లిలోని చైతన్యనగర్‌కు చెందిన బైరగోని గణేష్ మెడలో ఉన్న ఒకటిన్నర తులాల బంగారు గొలుసు, నల్లగొండలోని శివరాంనగర్‌కు చెందిన బొడ్డు శంకర్ మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు చైన్, చండూరు మండలం కొండాపురం గ్రామానికి చెందిన అద్దెల కృష్ణారెడ్డి మెడలో ఉన్న ఒకటిన్నర తులాల బంగారు గొలుసు, సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలానికి చెందిన కొమ్ము కోటేష్ మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు, ఓ మహిళ మెడలో ఉన్న రెండు తులాల చైన్‌ను కాజేశారు. పట్టణంలని లైన్‌వాడకు చెందిన హమీద్‌తో పాటు మరొకరి సెల్‌ఫోన్‌ను కూడా అపహరించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని సైతం దొంగలు వదలలేదు. ఆయన వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను కూడా చోరీ చేశారు. చోరీలకు పాల్పడిన వారిలో ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. బాధితుల ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దొంగల ముఠా కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

అంతర్రాష్ట్ర ముఠాగా పోలీసుల అనుమానం

మహాధర్నా సందర్భంగా వరుస చోరీలకు పాల్పడింది. అంతర్రాష్ట్ర ముఠా పనిగా పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న దొంగ మహారాష్ట్రకు చెందిన వ్యక్తిగా పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ఈ ముఠా ఆరుగురు నుంచి 11 మంది వరకూ కార్లలో నల్లగొండకు సోమవారం ఉదయం వచ్చి చోరీలకు పాల్పడేందుకు రెక్కీ నిర్వహించి పథకం రచించి ప్రణాళిక ప్రకారమే చోరీలకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ముఠా సభ్యులంతా ఒకేచోట కాకుండా కేటీఆర్ ర్యాలీలో కార్యకర్తలతో కలిసి నడిచే వారు కొంతమంది ఉండగా మరికొంత మంది ర్యాలీ మధ్యలో కొంత మంది ధర్నా వద్ద చోరీలకు పాల్పడేందుకు ముందస్తుగానే మకాం వేసినట్లు సమాచారం. ప్రస్తుతం పట్టుపడిన వ్యక్తి నుంచి వచ్చిన సమాచారం, అతని సెల్‌ఫోన్ ఆధారంగా వచ్చిన డేటా ప్రకారం మహబూబ్‌నగర్, హైదరాబాద్, సైఫాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో పెద్దఎత్తున ఈ ముఠా చైన్ స్నాచింగ్, పిక్ పాకెటింగ్‌తో పాటు పలు దొంగతనాలకు పాల్పడినట్లు విశ్వసనీయ సమాచారం. ఎక్కడెక్కడ చోరీలు చేశారు. ఎన్ని కేసులు ఉన్నాయే పూర్తిగా తెలిసే అవకాశముందని సమాచారం.

మూసీ కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదల



మూసీ కుడి కాల్వలో ప్రవహిస్తున్న నీరు

కేతేపల్లి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు రెండో విడత సాగునీటిని అధికారులు మంగళవారం విడుదల చేశారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టులో యాసంగి పంటల సాగుకు వంద రోజుల పాటు సాగు నీటిని విడుదల చేయాలని నిర్ణయించిన మేరకు మొదటి విడత 25రోజుల పాటు నీటిని విడుదల చేసిన అధికారులు నిర్ణీత గడువు ముగియడంతో ఈ నెల 16న నీటి విడుదలను నిలిపి వేశారు. 12రోజుల విరామం తర్వాత ఆయకట్టుకు రెండో విడత నీటిని విడుదల చేశారు. కుడి కాల్వకు 271.62 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 271.62క్యూసెక్కుల చొప్పున మొత్తం 543.24క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ఈ విడత నీటి విడుదల 15రోజుల పాటు (ఫిబ్రవరి 11వరకు) కొనసాగనుంది. 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుతం నీటిమట్టం 640.32అడుగులు(3.29టీఎంసీలు)గా ఉంది.

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

గుండాల, జనవరి28 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేశ్‌ను మంగళవారం డీఆర్‌డీవో నాగిరెడ్డి సస్పెండ్ చేశారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల విషయంలో ఫీల్డ్ అసిస్టెంట్ తప్పుడు సర్వే చేశారని ఉన్నతాధికారులకు పంపిన రిపోర్టులో ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఇల్లు ఉన్నప్పటికీ తనకు ఇల్లు లేదని రేకుల కొట్టంలో నివాసముంటున్నానని, గ్రామంలో ఇళ్లు లేని వారికి ఇళ్లు ఉన్నాయని తప్పుడు రిపోర్టు పంపించారని ఉన్నతాధికారులకు గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు





ఏఈఓకు చెక్కులను అందజేస్తున్న భక్తులు

భువనగిరి అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు 1001తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్ర నామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 29,79,250 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

స్వర్ణ తాపడానికి దాతల విరాళాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దివ్య విమాన రాజగోపురానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు రూ.2,22, 232విరాళంగా సమర్పించారు. హైదరాబాద్ మాదాపూర్‌కు చెందిన ఎన్.వేణుగోపాలరావు, ఎల్. మారుతి శంకర్ మంగళవారం వేర్వేరుగా చెరో రూ.1,11,116ల చెక్కులను ఏఈవో గజ్వేల్లి రమేష్‌బాబుకు అందజేశారు. వారి వెంట ఉప ప్రధానార్చకుడు మాధవాచార్యులు ఉన్నారు.

గోదావరి జలాలకు అడ్డుకట్ట

- అడ్డుకట్ట తొలగించాలంటున్న దిగువ రైతులు



అనంతారం బ్రిడ్జి వద్ద బిక్కేరు వాగులో నీరు దిగువకు వెళ్లకుండా అడ్డుకట్ట వేసిన దృశ్యం

మోత్కూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లాలో ఈ సారి భారీ వర్షాలు లేక చెరువులు, కుంటలు నిండలేదు. దీంతో భూగర్భ జలాలు బాగా తగ్గిపోయాయి. యాసంగి రైతులు తక్కువగా వరి నాట్లు వేశారు. చివరకు వేసిన కొద్దిపాటి వరి పంట అయినా చేతికి వస్తుందా లేదా అని ఇప్పటి నుంచే ఆందోళన చెందుతున్నారు. బిక్కేరు వాగులో చేతి బోర్లు వేసుకుని బిక్కేరు వాగుకు ఇరు వైపులా ఉన్న గ్రామాల రైతులు సాగు చేస్తున్నారు. ఈ యాసంగిలోనూ వరి నాట్లు వేశారు. వర్షాలు లేక బిక్కేరులోనూ నీరు లేదు. దీంతో ఆలేరు, తుంగతుర్తి ఎమ్మెల్యేలు బీర్ల అయిలయ్య, మందుల సామేలు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడి గంధమల్ల రిజర్వాయర్ నుంచి బిక్కేరు వాగులోకి నీరు విడుదల చేయించారు. ఈ నెల 27వ తేదీన తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలు నీటి పారుదల శాఖ ఎస్ఈతో మాట్లాడి నీటి ప్రవాహ వేగం పెరిగేలా మరో వంద క్యూసెక్కుల నీరు అదనంగా వదలాలని కోరారు. వారి కోరిక మేరకు బిక్కేరు వాగులోకి గోదావరి జలాలు వస్తున్నాయి. గుండాల మండలం అనంతారం వరకు నీళ్లు వచ్చాయి. బిక్కేరు వాగు ద్వారా దిగువన మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు నీరు వెళ్లకుండా కొందరు వ్యక్తులు అనంతారం బ్రిడ్జి వద్ద గడ్డి, గడ్డ కట్టిన సిమెంటు బస్తాలతో మంగళవారం అడ్డుకట్ట వేశారు. మోత్కూరు ప్రాంత రైతులు అక్కడకు వెళ్లి అడ్డుకట్ట వేయవద్దని చెప్పగా అక్కడి వ్యక్తులు వారితో తగాదా పడ్డారని చెబుతున్నారు. ఎమ్మెల్యే, నీటి పారుదల శాఖ అధికారులు వెంటనే స్పందించి అనంతారం వద్ద వేసిన అడ్డుకట్టను తొలగించాలని, మరో చోట అడ్డకట్ట వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని మోత్కూరు, అడ్డగూడూరు ప్రాంత రైతులు కోరుతున్నారు.

కాటమయ్య కిట్‌ను ఉపయోగించుకోవాలి



గీత కార్మికులకు శిక్షణ ఇస్తున్న ఎక్సైజ్ అధికారులు

నార్కట్‌పల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల బారిన పడకుండా గీత కార్మికులు కాటమయ్య కిట్‌ను ఉపయోగించుకోవాలని ఎక్సైజ్ ఎస్ఐ బలవర్ధన్ సూచించారు. ప్రభుత్వం అందజేస్తున్న కాటమయ్య రక్ష కిట్ల వాడకంపై కల్లు గీత కార్మికులకు నల్లగొండ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నార్కట్‌పల్లి శివారులో క్షేత్ర స్థాయి శిక్షణ ఇచ్చారు. ఈ కిట్టు ధరించి చెట్టెక్కితే కిందపడిపోయే అవకాశం చాలా తక్కువగా ఉంటుందన్నారు. కల్లు గీత వృత్తిచేస్తున్న సుమారు 74 మంది కల్లు గీత కార్మికులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. గీత చెట్టు ఎక్కడానికి ముందు కాటమయ్య కిట్లను ధరించే విధానంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ రామస్వామి, నాగరాజు, బీసీ సంక్షేమ శాఖాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలి'

మర్రిగూడ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం(ఓపీఎస్)ను పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఉదావత్ లచ్చిరాం డిమాండ్ చేశారు. మండలంలోని దామెరభీమనపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం భోజన విరామ సమయంలో యూపీఎస్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానం రద్దు కోసం తీవ్ర పోరాటం చేస్తుంటే ఇప్పుడు కేంద్ర ఆర్థికశాఖ కార్పొరేట్ శక్తులకు తలొగ్గి ఈయూపీఎస్ విధానం తీసుక రావడం అప్రజాస్వామికమన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు కంట్రిబ్యూషన్ లేకుండా పాత పెన్షన్ విధానం ప్రవేశ పెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ కార్యక్రమంలో కాట్రావత్ శ్రీనివాస్, సరంగి మంజులత, నుస్రత్ బేగం తదితరులు ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

తిప్పర్తి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): డబ్బులు వసూలు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్ అల్తాఫ్‌అహ్మద్ హుస్సేన్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. తిప్పర్తి గ్రామ పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఝాన్సీ అనర్హులుగా ఉన్న వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో అవకాశం కల్పించి ఒక్కొక్కరి నుంచి వెయ్యి రూపాయల చొప్పున వసూలు చేస్తున్నారన్నారు. ఫీల్డ్‌అసిస్టెంట్ వైఖరితో ఇప్పటి వరకు ఉపాధిహామీ పథకంలో పనులు చేయలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వంగూరి రవి, గ్రామస్థులు వడ్డెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పల్లె జానయ్య, రోజా, నవీన్, రాజశ్రీ ఉన్నారు.

బీసీ కార్పొరేషన్ ద్వారా కుమ్మరులకు రుణాలివ్వాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కుమ్మరి సంఘం నాయకులు

చిట్యాలరూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కుమ్మరి కులస్థులకు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వాలని కుమ్మరి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాడూరి చంద్రం కోరారు. మండలంలోని పెద్దకాపర్తిలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కుల వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న కుమ్మరులు ఆర్థికంగా వెనుకబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కులవృత్తులను ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. కుమ్మరులకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నీలకంఠం నరేష్, ఊట్కూరు రమేష్, నీలకంఠం కృష్ణయ్య, సిలివేరు సత్తయ్య, నీలకంఠం ముత్తయ్య, నీలకంఠం లింగస్వామి, చిలువేరు బాలకృష్ణ, ఊట్కూరు నర్సింహ, నీలకంఠం రాజు, సాయి పాల్గొన్నారు.

ఆలయంలోకి నాగుపాము



చిట్యాలరూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలం పెద్దకాపర్తిలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలోకి మంగళవారం నాగుపాము దర్శనమిచ్చింది. రోజుమాదిగానే ఆలయంలో పూజలు నిర్వహించేందుకు వెళ్లిన స్థానికుడు నీలకంఠం నరేష్‌కు గర్భగుడిలో నాగుపాము కన్పించింది. ఆలయంలోపలికి వెళ్లిన కొద్దిసేపటికి ఆ పాము గర్భగుడిని నుంచి బయటకు వచ్చి పక్కనే ఉన్న హుండీ పక్క నుంచి బయటకు వెళ్లిపోయింది.

ఎల్లమ్మకు హారతి పూజలు



అలంకరణలో అమ్మవారు

కనగల్, జనవరి 28: (ఆంధ్రజ్యోతి) మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయానికి మంగళవారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు చేసి బోనవైవేద్యాలు సమర్పించుకున్నారు. ఉదయం అర్చకులు అమ్మవారికి వివిధ రకాల పుష్పాలు నిమ్మ కాయలతో మాలలు వేసి విశేషంగా అలకరించారు. నాగ హారతి, సింహహారతి, అఖండ హారతిలిచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

డైట్ పాఠశాలకు ఆర్వో ప్లాంట్ అందజేత



ఆర్వో ప్లాంట్ ప్రారంభిస్తున్న బ్యాంక్ మేనేజర్ బాబు

నల్లగొండ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నల్లగొండ మండలంలోనే అత్యధిక విద్యార్థుల సంఖ్య ఉన్న ప్రభుత్వ ప్రాథమిక డైట్ పాఠశాలకు ఐడీబీఐ బ్యాంక్ రూ.67వేల విలువైన ఆర్వో ప్లాంట్‌ను సోమవారం అందజేసింది. ఈ ప్లాంట్‌ను మండల విద్యాధికారి కత్తుల అరుంధతి, ఐడీబీఐ బ్యాంక్ మేనేజర్ బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు భానుప్రకాష్‌గౌడ్, పీఆర్టీయూ అర్బన్‌శాఖ ప్రధాన కార్యదర్శి వీరమల్ల శ్రీనివాస్‌గౌడ్, బద్రీనాథ్ యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఝాన్సీలక్ష్మి, నసీమా, షాజియా, వెంకటేశ్వర్లు, శివప్రసాద్, పాల్గొన్నారు.

కర్ర జారిందా.. కరెంటు గోవిందా

● చెర్వుగట్టు ఘాట్‌రోడ్‌పై తీగలు తగలకుండా కట్టిన కర్ర



చెర్వుగట్టు ఘాట్‌రోడ్డుపై విద్యుత్ తీగలు తగలకుండా వేలాడదీసిన కర్ర

నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఘాట్‌రోడ్‌పై శివుని విగ్రహం వెనుక ఉన్న 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ స్తంభాల తీగలు ఒకదానికి ఒకటి తగిలే స్థితిలో కర్రే ఊతంగా మారింది. గుట్ట మీదకు, గుట్ట కింద పార్వతీ అమ్మవారి ప్రాంగణానికి విద్యుత్ సరఫరా చేసేందుకు 220 ఓల్ట్స్‌తో ఉన్న విద్యుత్‌ను సరఫరా చేసే రెండు విద్యుత్ లైన్లు వేర్వేరుగా ఉన్నాయి. అయితే కొన్ని రోజుల క్రితం వీటిలో గుట్టపైకి వెళ్లే విద్యుత్ లైన్ తీగలు గుట్ట కిందికు వెళ్లే విద్యుత్ లైన్ తీగలకు తగులుతుడడంతో ఫ్యూజులు కాలిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయమేర్పడుతోంది. దీంతో తీగలు అవి ఒకదానికొకటి తగలకుండా తాత్కాలిక పరిష్కారంగా దేవస్థానం ఎలక్ట్రిషియన్ గుట్టపైకి వెళ్లే విద్యుత్ లైన్ తీగలు కిందకు వంగేలా కర్రకు బరువును కట్టి తీగలపై వేలాడదీశాడు. ఏ మాత్రం కర్ర కింద పడినా పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చి విద్యుత్ సరఫరాకు అంతరాయమేర్పడనుంది.

● నార్కట్‌పల్లి, (ఆంధ్రజ్యోతి) .

పట్టణ అభివృద్ధికి కృషి చేశాం



మాట్లాడుతున్న మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పదవులు ఉన్నా లేకున్నా పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని నల్లగొండ మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పదవీకాలం పూర్తిచేసుకున్న మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్‌ను నల్లగొండ పట్టణంలోని 47 వార్డు విద్యానగర్ పార్కులో విద్యానగర్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ మున్సిపల్ చైర్మన్‌గా పట్టణ అభివృద్ధి కోసం కృషిచేసినట్లు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో నల్లగొండ పట్టణం లోని కోట్లాది రూపాయలతో వార్డుల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. పట్టణ అభివృద్ధి కోసం సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభకార్, కాంగ్రెస్ నాయకులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

శాలిగౌరారం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం మాదారం జడ్పీ స్కూల్, ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గ్రామంలోని బత్తుల ఉమా రాణి, సోదరుడు మన్నె నరేష్ కుమార్‌లు మధ్యాహ్న భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. తన భర్త కీర్తిశేషులు బత్తుల శరత్ యాదవ్ జ్ఞాపకార్థం విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బత్తుల భద్రయ్య ముత్యాలమ్మ, గ్రామ కార్యదర్శి శివకుమార్, మాజీ సర్పంచ్ జెర్రిపోతుల చంద్రమౌళి, శంకర్, శ్రీను, మహబూబ్ పాల్గొన్నారు.

నకిరేకల్ ఏరియా ఆస్పత్రి తనిఖీ

నకిరేకల్, జనవరి 28, (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ ఏరియా ఆసుపత్రిలో అత్యాధునిక క్షయ నిర్ధారణ(తెమడ) పరీక్షల కేంద్రాన్ని జిల్లా క్షయ నివారణ అధికారి కె. కళ్యాణ్ చక్రవర్తి మంగళవారం తనిఖీ చేశారు. కేంద్రంలో జరుగుతున్న పరీక్షల తీరు, ఎన్ని నమోదు అవుతున్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి సలహాలు సూచనలు చేశారు. ఆయన వెంట సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ యాసారపు రామకృష్ణ, జిల్లా టీబీ ఫార్మసిస్ట్ రఘురాంరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

రైతు మహాధర్నాకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



మర్రిగూడ నుంచి బయలుదేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

కట్టంగూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నల్లగొండలో మంగళవారం జరిగిన రైతు మహాధర్నాకు కట్టంగూరు మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లాయి. మాజీ జడ్పీటీసీ తరాల బలరాం, మాజీ మండలాధ్యక్షుడు ఉట్కూరి ఏడుకొండల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నూక సైదులు, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, పెద్ది బాలనర్సింహ, నేముల వెంకటేశ్వర్లు, రాచకొండ యాదయ్య, ముప్పిడి యాదయ్య, చిట్యాల రాజిరెడ్డి ఉన్నారు.

నార్కట్‌పల్లి: నల్లగొండలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హాజరైన రైతు మహాధర్నాకు నార్కట్‌పల్లి మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు బైక్‌లపై తరలివెళ్లారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, మేకల రాజిరెడ్డి, యానాల అశోక్‌రెడ్డి, బద్దం రాంరెడ్డి, దోసపాటి విష్ణుమూర్తి ఉన్నారు.

మర్రిగూడ: నాలుగు పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైందని రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నల్లగొండలో నిర్వహించిన రైతు మహాధర్నాకు మర్రిగూడ బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. రైతుభరోసా, రుణమాఫీ అమలు చేస్తామని సంవత్సరం గడుస్తున్నా పూర్తిగా అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోటకూరి శంకర్, మాల్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ బంటు జంగన్, అయిలి లక్ష్మీనర్సింహ, సురేందర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, నల్ల యాదయ్య గౌడ్, పందుల యాదయ్య, నర్సింహ, బచ్చు రామకృష్ణ, బిక్షంరెడ్డి, వెంకట్రాం తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి: నల్లగొండలో జరిగిన రైతు మహాసభకు నాంపల్లి బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుమ్మడపు నర్సింహరావు, పోగుల వెంకట్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, నక్క చంద్రశేఖర్, మాజీ సర్పంచ్‌లు బాషిపాక రాములు, నాగులవంచ శ్రీలత, కారింగు నర్సింహ, రమావత్ రవినాయక్, బుడిగపాక గోవర్ధన్, సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, ఇట్టెం వెంకట్‌రెడ్డి, పచ్చిపాల రామాంజనేయులు ఉన్నారు.



నాంపల్లి నుంచి బయలుదేరుతున్న బీఆర్ఎస్ నాయకులు



కట్టంగూరు నుంచి బయలుదేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

మునుగోడు అభివృద్ధికి నిధులు కేటాయించాలి



మంత్రి సీతక్కతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, మునుగోడు రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మునుగోడు నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గ్రామీణ అభివద్ధి శాఖ మంత్రి సీతక్కను కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిశారు. నియోజకవర్గంలో అన్ని వనరులు ఉన్నప్పటికీ అభివృద్ధిలో మాత్రం వెనుకబాటులో ఉందన్నారు. నియోజకవర్గంలో కొత్తగా చేపట్టే రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పన వంటి వివిధ అభివృద్ధి పనులపై చర్చించారు. కొత్తగా చేయాల్సిన పనులు అవసరమైన నిధులు వంటి విషయాలపై ప్రత్యేకంగా మాట్లాడానని, తన కోరిక మేరకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

అహల్యాబాయి గురించి తెలుసుకోవాలి



రాణి అహల్యాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రామగిరి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాణి అహల్యాబాయి గురించి తెలుసుకోవాలని సామాజిక సమరసత కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు. రాణి అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మా ట్లాడారు. మతవ్యాప్తి, వ్యాపారం, ఆధిపత్యాల కోసం పోరాటం చేసే దేశాల గురించి చెప్పుకుంటున్న తరుణంలో సర్వేజనా సుఖినోభవంతు అని చెప్పిన ఏకైక దేశం భారతదేశం అని అన్నారు. 1947కు ముందు ఏడుసార్లు కరువును ఎదుర్కొన్న భారతదేశం నేడు విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి వచ్చిందన్నారు. 1740లో ఇక్కడి రైతులు, చేనేత కార్మికులను ఇంగ్లాండ్ తీసుకెళ్లి మన వ్యాపార వాణిజ్య రంగాలను దెబ్బతీసే విధంగా ప్రయత్నిస్తే రాణి అహల్యాబాయి కార్మికులకు తిరిగి శిక్షణ ఇప్పించి ఆయా రంగాలను పునరుజ్జీవం చేశారని వివరించారు. కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆర్ఎస్ఎస్ సంఘచాలక్ గార్లపాటి వెంకటయ్య, దోనపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్‌పై దాడి అమానుషం

మిర్యాలగూడ రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మార్కెట్ యార్డు కార్యాలయంపై దాడి చేసిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని టీఎన్‌జీవో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగస్థుల సంఘం అధ్యక్షుడు బాలశెట్టి మధుబాబు అన్నారు. మండలంలోని అవంతీపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం ఉద్యోగస్తులతో కలిసి నిరసన తెలిపి మాట్లాడారు. ధరల విషయంలో హెచ్చు తగ్గులకు మార్కెట్ కార్యదర్శికి, సిబ్బందికి ఎలాంటి సంబంధం ఉండదన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలి: డీఎల్‌పీవో



కట్టంగూరు: నారగూడెంలో వైకుంఠధామాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

కట్టంగూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని డీఎల్‌పీవో వెంకటేశ్వర్లు ఆయా గ్రామాల కార్యదర్శులకు సూచించారు. మండలంలోని మునుకుంట్ల, నారగూడెం, నల్లకుంటబోలు, పందెనపల్లి, చెర్వుఅన్నారం, అయిటిపాముల గ్రామపంచాయతీలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన ఆయా గ్రామాల్లో కంపోస్టు షెడ్‌లను, వైకుంఠదామాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో చలపతి, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

గట్టుప్పల్: మండల పరిషత్ కార్యాలయం నిర్వహించేందుకు మండలకేంద్రంలోని పలు భవనాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి జూలకంటి మాదవరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటు చేసి మండల ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షఫీ, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నామ జగన్నాథం, మండల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

నకిరేకల్, జనవరి 28, (ఆంధ్రజ్యోతి): చందుపట్ల గ్రామంలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఘనంగా 16 రోజుల పండుగ కార్యక్రమం నిర్వహించారు. గోదా భక్తమండలి సభ్యులు గోదారంగనాథ స్వామికి పుష్ప మాలలు, తులసి మాలలు, నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మేడవరపు కిషన్‌రావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వంట సామాగ్రి అందజేత

మునుగోడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మునుగోడు గ్రామపంచాయతీ పరిధిలోని బట్లకాలువకు చెందిన కాంగ్రెస్ మండల నాయకుడు ఆరేళ్ల సైదులుముదిరాజ్ స్థానిక అంగన్‌వాడీ కేంద్రం- 2లో వంట సామాగ్రి మంగళవారం అందజేశారు. ఆ కేంద్రంలో చిన్నారులకు ఇబ్బందులు లేకుండా పరిష్కరించాలని సమాగ్రి అందజేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

మునుగోడు రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లోరిగూడెంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించినందుకు కృతజ్ఞతగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఫ్లెక్సీకి మంగళవారం పాలాభిషేకం చేశారు. మండలంలో అర్హులైన వారికి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు మంజూరు కావడం సంతోషంగా ఉందని గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జంగిలి నాగరాజు, బొల్లం మహేష్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సత్తయ్య, గడగోటి నవీన్, కట్టెకుంట్ల నరేష్ పాల్గొన్నారు.

బహిరంగసభను జయప్రదం చేయాలి

దేవరకొండ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఫిబ్రవరి 7న తల పెట్టిన ఎస్సీ వర్గీకరణ అమలు కోసం లక్ష డప్పులు, వేల గొంతుకల మహాప్రదర్శన బహిరంగ సభ ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కంబాలపల్లి వెంకటయ్య అన్నారు. స్థానిక రహదారిబంగ్లాలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఏబీసీడీ వర్గీకరణ కోసం 30ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ సుదీర్ఘ పోరాటాలు నిర్వహిస్తుం దన్నారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణకు సహకరిస్తానని హామీ ఇచ్చాడని, వెంటనే అమలు చేయాలని డి మాండ్ చేశారు. సభకు ఎమ్మార్పీఎస్‌తో పాటు మాదిగ ఉప కులాలు వేలాదిగా తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎర్ర ఆంజనేయులు, పాల్గొన్నారు.

●చింతపల్లి,(ఆంధ్రజ్యోతి):ఎమ్మార్పీఎస్ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని సంఘం మండలాధ్యక్షుడు కోడుదోటి లక్ష్మణ్ తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ సర్పంచ్ గఫార్

నాంపల్లి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నేరేళ్లపల్లి గ్రామానికి చెందిన షేక్ బాబుమీయా అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. గ్రామ మాజీ సర్పంచ్ సయ్యద్ గఫార్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయంగా రూ.10వేలు అందజేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు బచ్చనబోయిన రమేష్, గునెబోయిన యాదయ్య, మల్లయ్య, రాములు, బచ్చనబోయిన కొండల్, వంగూరు సైదులు, మాద రమేష్, ఉడుత పర్వతాలు, ఎడ్ల వెంకన్న, శ్రీరాములు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు, నోట్‌బుక్స్ పంపిణీ

శాలిగౌరారం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబారిపేటలోని శ్రీకృష్ణ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబారిపేట యూపీఎస్ స్కూల్‌లో బీఆర్ఎస్వీ జిల్లా ప్రధాన కార్యదర్శి నోముల క్రాంతి యాదవ్ జన్మదినం పురస్కరించుకొని పరీక్ష ప్యాడులు, పెన్నులు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం దేవయాని, ఉపాధ్యాయులు ఇందిర, రాజేశ్వరీ, నాయకులు చలకాని కుమారస్వామి, ముక్కామాల నరేష్, చలకాని నరేష్, గణేష్, పరమేష్, సతీష్, నాగరాజు పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 76

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.149	235	265
సూర్యాపేట	రూ.135	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.5 కనిష్ఠం 18.0



నల్లగొండలో ధర్నాలో పాల్గొన్న కార్యకర్తలు

దమ్ముంటే సభ పెట్టి ఏం చేశారో చెప్పండి

- నల్లగొండకు ఏడాదిలో ఉత్తమ్, కోమటిరెడ్డి చేసిందేమీలేదు
- అన్నిరంగాల్లో అభివృద్ధి చేసింది కేసీఆరే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రైతాంగ సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం : మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి
- నల్లగొండ గడియారం సెంటర్‌లో బీఆర్ఎస్ 'రైతు మహాధర్నా'

'కోమటిరెడ్డి వెంకటరెడ్డి మీకు దమ్ము, ధైర్యముంటే గడియారం సెంటర్‌లో మాలాగే మీటింగ్ పెట్టి, ఈ ఏడాది కాలంలో ఏం చేశారో వివరించాలి.. మా పార్టీ నుంచి జగదీ‌ష్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి వస్తారు.. మా పదేళ్ల పాలనలో ఏం చేశామో వివరిస్తారు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే.తారకరామారావు సవాల్ చేశారు. మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నల్లగొండలో నిర్వహించిన రైతు మహాధర్నాలో ఆయన మాట్లాడారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

మీటింగ్ పెడతామంటే పోలీసులతో అడ్డుకున్నారని, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిపై పోలీసులను అడ్డుపెట్టి దాడిచేయించారని, తాము మీటింగు పెడతామంటే మంత్రికి అంత భయమెందుకని ప్రశ్నించారు. కొందరు పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలకు మించి ప్రవర్తిస్తున్నారని, రానున్నది గులాబీపార్టీయేనని, వడ్డీతో సహా తిరిగిస్తామని హెచ్చరించారు. ఇటీవల ఒక మంత్రి అసెంబ్లీలో నల్లగొండకు కేసీఆర్ ఏం చేశారని ప్రశ్నించారని, నల్లగొండను దేశంలోనే అత్యధికంగా వరి పండించే ప్రాంతంగా తీర్చిదిద్దింది కేసీఆరే అని, ఎస్ఆర్ఎస్పీ స్టేజీ-2 కింద, నాగార్జునసాగర్ కింద టెయిలాండ్ భూములకు నీరందించింది కేసీఆరే అని అన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక ఉత్పత్తి సామర్థ్యంతో దామరచర్లలో విద్యుదుత్పత్తి కేంద్రాన్ని కట్టించింది కేసీఆర్ అని, యాదాద్రి ఆలయాన్ని తీర్చిదిద్ది లక్ష్మీనరసింహస్వామి రుణం తీర్చుకున్నది కేసీఆర్అని, మూడు మెడికల్ కళాశాలలు కట్టించింది కూడా కేసీఆరేనని అన్నారు. ఎంజీ యూనివర్శిటీలో పిల్లలకు గొడ్డుకారం పెడుతున్నారని, ఐటీ టవర్ కళతప్పిందని విమర్శించారు. ప్రపంచంలో ఏ శక్తి ప్రజాశక్తి ముందు సాటికాదని, ఆ విషయాన్ని నల్లగొండ రుజువు చేసిందని, ఒకనాడు నియంతను నిలదీసి కొట్లాడిన చరిత్ర నల్లగొండ గడ్డదని అన్నారు. నల్లగొండ కష్టాలపై మాజీ సీఎం కేసీఆర్ స్వయంగా పాటలు రాశారని తెలిపారు. నల్లగొండ జిల్లాలో ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని, పాలిచ్చే ఆవును వదులుకొని ఎగిరితన్నే దున్నపోతును...

- మిగతా 7వ పేజీలో...

రైతుల కోసం పోరాటం : జగదీ‌ష్‌రెడ్డి

నల్లగొండ జిల్లాలోని కుక్కమూతిపిందెల వంటి నాయకులకు తాము భయపడేది లేదని, మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాలతో రైతులకు ఊరట కలిగించేందుకు, వారి తరపున పోరాడ తామనే సందేశమిచ్చేందుకే కేటీఆర్ నల్లగొండకు వచ్చారని మాజీమంత్రి గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి అన్నారు. రైతాంగం మద్దతుతోనే తెలంగాణ రాష్ట్ర కల సాకారమైందని, నాడు రాష్ట్రంలో కరెంటు ధరల పెంపును నిరసిస్తూనే కేసీఆర్ రాజీనామా చేసి ఉద్యమం ప్రారంభించారని అన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు బీఆర్ఎస్‌కు రైతులే అండగా ఉన్నారన్నారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ చచ్చుడో నినాదంతో రాష్ట్రం సాధించామన్నారు. రాష్ట్రం వచ్చాక ప్రజల కోరిక మేరకు అధికారంలోకి వచ్చి, పదేళ్లు పాలించామని, కేసీఆర్ నేతృత్వంలో రైతును రారాజును చేసి చూపామన్నారు.



ఈ ఖర్చు భరించలేం!

- ఇంటర్ ప్రాక్టికల్, వార్షిక పరీక్షలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని బోర్డు ఆదేశం
- మొత్తం 22 సీసీ కెమెరాలకు రూ.88వేలు
- ప్రభుత్వ బకాయి రూ.63కోట్లు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలగాక భారంగా సాగుతున్న కళాశాలలు

ఇంటర్ కళాశాల యాజమాన్యల పరిస్థితి మూలిగేనక్కపై తాటికాయ పడిన చందంగా మారింది. ఇప్పటికే మూడేళ్లుగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకాక యాజమాన్యాలు ఇబ్బందుపడుతుండగా, ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహణకు ల్యాబ్, వార్షిక పరీక్షల గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఇంటర్ బోర్డు మూడు రోజుల క్రితం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో కెమెరాల ఏర్పాటుకు నిధులు ఎక్కడి నుంచి తేవాలని యాజమాన్యాలు ప్రశ్నిస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి,కోదాడ)

ప్రాక్టికల్స్ పరీక్షకు గదికి మూడు కెమెరాల చొప్పున, వార్షిక పరీక్షలకు గదికి ఒక సీసీకెమెరా ఏర్పాటు చేయాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో 140 కళాశాలలు ఉన్నాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని కళాశాలలకు మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌గా రూ.63కోట్లకు పైగా రావాల్సి ఉంది. ల్యాబ్, వార్షిక పరీక్షల నిర్వహణకు ప్రతీ కళాశాలలో బోర్డు నిబంధనల ప్రకారం 22సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఒక్కోకెమెరాకు రూ.4వేల చొప్పున రూ.88వేలు వ్యయం అవుతుంది.దీంతో యాజమాన్యాలు బావురుమంటున్నాయి. ఇదిలా ఉంటే మొదటిసారి ప్రాక్టికల్ పరీక్షల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని బోర్డు సూచించడం, గూగుల్ జీపీఎస్ ద్వారా డ్యాష్ బోర్డుకు వాటిని అనుసంధానం చేసి, పరీక్షలను పర్యవేక్షించాలని నిర్ణయించడంతో విద్యార్థుల్లో భయం నెలకొంది. విద్యాసంవత్సరం ప్రారంభంలో చెప్పకుండా బోర్డు,పరీక్షల సమయంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని చెప్పడంపై కళాశాల యాజమాన్యాలతోపాటు విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈఏడాది సీసీ కెమెరాల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 140 కళాశాలలు

ఉమ్మడి జిల్లాలో 140 కళాశాలలు ఉన్నాయి. విద్యార్థులు ఆయా కళాశాలల్లో 42వేల మంది

- మిగతా 6వ పేజీలో...

సీసీ కెమెరాలతో రూ.1.20కోట్ల భారం

గతంలో ల్యాబ్, వార్షిక పరీక్షల సమయంలో కళాశాల ఆఫీస్‌లో మాత్రమే ఒక కెమెరా ఉండేది. ఈ ఏడాది మాత్రం ల్యాబ్‌లో మూడు కెమెరాల చొప్పున, ఫిజిక్స్ కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ ల్యాబ్‌లలో మొత్తం 12 కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. వార్షిక పరీక్షలకు 10గదులకు, 10 కెమెరాలు ఏర్పాటు చేయాలని, మొత్తంగా 22 కెమెరాలను ఏర్పాటు చేయాలి. ఒక్కో కెమెరాకు రూ.4వేల చొప్పున, 22 కెమెరాలకు రూ.88వేలు వ్యయం అవుతుంది. మొత్తంగా 140 కళశాలలపై సీసీ కెమెరాల భారం రూ.1.20కోట్లు. దీంతో కళాశాలల యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నాయి.

మునిసిపల్ ప్రత్యేక అధికారిగా అదనపు కలెక్టర్



అదనపు కలెక్టర్ శ్రీనివా‌స్‌కు స్వాగతం పలుకుతున్న మునిసిపల్ కమిషనర్లు

రామగిరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ప్రత్యేక అధికారిగా అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు.

విద్యార్థినులు కష్టపడి చదవాలి

న్యాక్ చైర్మన్ పసుమాముల ప్రకాష్



పాటల సీడీని ఆవిష్కరించి మాట్లాడుతున్న న్యాక్ చైర్మన్ డాక్టర్ ప్రకాష్

దేవరకొండ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) చైర్మన్ పసుమాముల ప్రకాష్ అన్నారు. మంగళవారం దేవరకొండ మండలం షైనంపల్లిలోని గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను న్యాక్ బృందం ప్రొఫెసర్ డాక్టర్ సుమతిమోహన్, ప్రొఫెసర్ ఎం.కిషోర్‌నాయక్ బృందం సందర్శించింది. కళాశాలలోని విద్యార్థుల సంఖ్య, వసతులు, మౌలిక సౌకర్యాలు తదితర అంశాలపై ఆరాతీశారు. అనంతరం కళాశాలలో చదివే విద్యార్థినుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటుచేసి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా న్యాక్ చైర్మన్ డాక్టర్ పసుమాముల ప్రకాష్ విద్యార్థినులతో మాట్లాడారు. మూడో సంవత్సరం చదువుతున్న శైలజ రాసి, పాడిన పాట సీడీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.హరిప్రియ, వైస్ ప్రిన్సిపల్ శ్వేత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆడపిల్లలపై వివక్ష వద్దు

డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

నల్లగొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలపై వివక్ష వద్దని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగిన జిల్లాస్థాయి సలహా సమావేశంలో ఆయన మాట్లాడారు. పుట్టబోయేది ఆడబిడ్డ అని తెలియగానే కొన్ని కుటుంబాలు గర్భస్రావానికి సిద్ధపడుతున్నారని, గర్భస్రావం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ స్వరూపరాణి, సుచరిత, స్రవంతి, అరుంధతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్ రెడ్డి, గీత, గ్రామ్యా, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి.. వారానికే ఖాళీ

నిరుపయోగంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్



6

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం

- సర్కారు దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- సాగర్ కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రి తనిఖీ



ఆస్పత్రిలో డాక్టర్ హరికృష్ణను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నాగార్జునసాగర్, జనవరి28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందుతుందని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. మంగళవారం ఆమె సాగర్ కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె ఆసుపత్రిలో వార్డులు, ల్యాబ్‌ను, ఓపీ, క్యాజువాలిటీ, ఎమర్జెన్సీ, ఎంసీహెచ్, తదితర వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె డయాలసిస్ రోగితో అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరికృష్ణతో కలిసి వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్కారు దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాగర్ ఏరియా ఆస్పత్రిలో అధునాతన యంత్ర పరికరాలు, వైద్య సౌకర్యాలున్నాయన్నారు. అనంతరం పాత ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ భానుప్రసాద్ నాయక్, తహసీల్దార్ పావని సరోజ, ఆర్ఐ దండా శ్రీనివా‌స్‌రెడ్డి పాల్గొన్నారు.

హాస్టళ్లలో పరిశుభ్రత పాటించాలి

పెద్దవూర: సంక్షేమ వసతిగృహాలు, కేజీబీవీలు, గురుకుల పాఠశాలల్లోని స్టోర్‌రూమ్‌లతోపాటు కిచెన్, డైనింగ్‌హాల్‌లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. మండలంలోని బాలికల గిరిజన సంక్షేమ వసతిగృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. అంతకుముందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీచేశారు. నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవన నిర్మాణాన్ని మార్చిలోపు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. ఆమెవెంట తహసీల్దార్ సరోజ పావని, గిరిజన సంక్షేమ హాస్టల్ సంక్షేమాధికారి తదితరులు ఉన్నారు.

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

కనగల్: ఎరువుల దుకాణాల డీలర్లు యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలుంటాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. మంగళవారం కనగల్ ఎక్స్‌రోడ్డులోని ఓ ఎరువుల దుకాణాన్ని ఆకస్మిక తనిఖీ రికార్డులను పరిశీలించారు. ఈ పాస్ మిషన్‌ద్వారా దుకాణంలోని ఎరువుల నిల్వలను, సరఫరా వివరాలను తెలుసుకున్నారు. అంతకుముందు కనగల్ పీహెచ్‌సీని కలెక్టర్ తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. కనగల్ హైస్కూల్‌లో మరుగుదొడ్లు, అదనపు తరగతి గది పనులను పరిశీలించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ పద్మ, ఎంఈవో పద్మ, డాక్టర్ రామకృష్ణ, డీటీ ఆర్ఐ సునీత, ఏఈవోలు అభిలాష్, నవీన్, హెచ్ఎం విద్యాభార్గవి, కార్యదర్శి వీరబాబు పాల్గొన్నారు.

పాఠాలు బోధించిన కలెక్టర్

కనగల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఇలాత్రిపాఠి తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆమె తొమ్మిదో తరగతి బీ-సెక్షన్ విద్యార్థులకు క్లాస్‌రూంలో పాఠాలను బోధించారు. వారి విద్యాప్రగతిని అంచనా వేశారు. బట్టీ చదువులు కాకుండా, గుణాత్మకమైన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో పద్మ,హెచ్ఎం విద్యాభార్గవి పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని చూసి ఆనందం వ్యక్తం చేసిన కలెక్టర్

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఇక్కడ పనిచేసే ఇంజనీర్లు, ఉద్యోగులు, అధికారులు, సిబ్బందికి వైద్య సేవలు అందించడానికి నాటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ హిల్‌కాలనీలో ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ ఆస్పత్రి నిర్మాణం పూర్తయిన తర్వాత ఆయన కుమార్తె శ్రీమతి ఇందిరాంధి ప్రధాని హోదాలో 1983 డిసెంబరు 6న సాగర్‌లో నిర్మించిన ఏరియా ఆస్పత్రిని ప్రారంభించారు. ఇక్కడ పనిచేసే ఉద్యోగులు నెహ్రూ మీద అభిమానంతో ఆ ఆసుపత్రికి నెహ్రూ సతీమణి కమలా పేరున కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రిగా నామకరణం చేశారు. ఇంతటి గొప్ప చరిత్ర కలిగిన ఆసుపత్రిని తనిఖీ చేయడానికి సాగర్‌కు వచ్చిన కలెక్టర్ ఇలా త్రిపాఠి ఈ ఆసుపత్రిని నాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ప్రారంభించారని తెలుసుకొని, ఆమె ప్రారంభించిన శిలాఫలకాన్ని చూసి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం అక్కడే ఫొటో దిగారు.

చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు సీఎంకు ఆహ్వానపత్రిక



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం, తదితరులు

నార్కట్‌పల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అతి పెద్ద బ్రహ్మోత్సవాలుగా ప్రాచుర్యం పొందిన నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆహ్వానపత్రికను మంగళవారం అందజేశారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివా‌స్‌రెడ్డిలకు తొలుత ఆహ్వాన పత్రికలను అందజేసిన వీరేశం అనంతరం మంత్రులతో కలిసి సీఎం రేవంత్‌ను సచివాలయంలోని ఆయన చాంబర్‌లో కలిసి క్షేత్ర ప్రాశస్త్యాన్ని, ఉత్సవ విశేషాలను వివరించారు. దేవస్థాన ప్రధాన పూజారి పోతులపాటి రామలింగేశ్వరశర్మ వారికి ఆశీర్వచనం చేశారు. అంతకుముందు బ్రహ్మోత్సవాల ప్రచార వాల్ పోస్టర్లను మంత్రి వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. వీరి వెంట ఎండోమెంట్ ఏసీ భాస్కర్, దేవస్థాన ఈవో సిరికొండ నవీన్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు బత్తుల ఊశయ్య, బండ సాగర్‌రెడ్డి, నేతకాని కృష్ణయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, నల్ల వెంకన్న, అలుగుబెల్లి రవీందర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, సట్టు సత్తయ్య, గడుసు శశిధర్‌రెడ్డి, మేకల వెంకన్న, రేగట్టె నవీన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వారాల రమేశ్, శంకర్, కిట్టు, నాగరాజు ఉన్నారు.

ఆదాయం లేదు.. అభివృద్ధి లేదు

● అభివృద్ధికి ఆమడ దూరంలో నందికొండ మునిసిపాలిటీ

(నాగార్జునసాగర్-ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ పాలనలో 2018 ఆగస్టులో సాగర్‌లో ఉన్న రెండు కాలనీలను ఎన్ఎస్పీ పరిధిలోని 12 వార్డులతో నందికొండను మునిసిపాలిటీగా ఏర్పాటు చేశారు. సాగర్ కాలనీల్లో ఉన్న నివాస గృహాలు అన్ని ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కట్టినవి కావడంతో ఆ ఆస్థి అంతా ఎన్ఎస్పీకే చెందుతుంది. నివాస గృహాల అద్దెలు సైతం ఎన్ఎస్పీలో టీఅండ్ఆర్ విభాగం ఇంజనీర్లు వసూలు చేస్తారు. అంతే కాకుండా కాలనీల్లో పదుల సంఖ్యలో మాత్రమే కిరాణ దుకాణాలు ఉంటాయి, వ్యవసాయ భూములు, వ్యవసాయ కూలీలు ఎవరూ ఉండరు. దీంతో నందికొండకు వచ్చే ఆదాయం నయా పైసా కూడా లేదు. దీంతో అభివృద్ధికి నోచుకోక కాలనీల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది.

2020లో స్థానిక సంస్థల ఎన్నికలు

సాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి ఆరు దశాబ్దాలు దాటిన తర్వాత మొదటిసారిగా 2020 జనవరిలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. నాటి నుంచి రెండు కాలనీల్లో కలిపి 12 వార్డులకు కౌన్సిలర్లు ఉన్నారు. కానీ ఏ పని చేయాలన్నా ఆదాయం లేకపోవడంతో కాలనీల్లో వార్డుల్లో పారిశుధ్యం, మురుగునీటి వ్యవస్థ, తాగునీటి సరఫరా అధ్వానంగా తయారైంది. 2021లో నాటి సీఎం ఆదేశాల మేరకు కలెక్టర్ నిధులు నుంచి వేతనాలు ఇస్తూ అవుట్ సోర్సింగ్‌లో పారిశుధ్య కార్మికులను నియమించడంతో పాటు, వీధుల్లో చెత్తను సేకరించడానికి నాలుగు ఆటోలను కొనుగోలు చేశారు. వాటికి డీజిల్, సిబ్బంది వేతనాలు కలెక్టర్ నిధులతో పాటు, ప్రభుత్వం కేటాయించిన ప్రత్యేక నిధులతో ఇప్పటి వరకు నెట్టుకొచ్చారు మునిసిపాలిటీకి పైసా ఆదాయం లేకపోవడంతో ఇక్కడ ఏ ఒక్క కమిషనర్ కూడా ఏడాది, ఆరు నెలల కూడా పనిచేయలేదు. మునిసిపాలిటీ ఏర్పడిన ఆరేళ్ల కాలంలో 6 మంది కమిషనర్లు వచ్చి వెళ్లారు. కొంతకాలం హాలియా మునిసిపాలిటీ కమిషనర్ ఇన్‌చార్జిగా ఉన్నారు.

సగం నిర్వహణ ఎన్ఎస్పీ పరిధిలోనే

నాగార్జునసాగర్ నందికొండ మునిసిపాలిటీగా ఏర్పడి ఆరేళ్లు గడుస్తున్నప్పటికీ ఇక్కడ ఉన్న నివాస గృహాలు, తాగునీటి సరఫరా విభాగం ఎన్ ఎస్పీ పరిదిలోనే ఉన్నాయి. అంతే కాకుండా నివాస గృహాలకు విద్యుత్ సరఫరా విభాగం ట్రాన్స్‌కో ఆధీనంలో ఉండగా వీధి దీపాల నిర్వహణ మాత్రమే మునిసిపాలిటీ చూసుకుంటుంది. తాగునీటి విభాగం ఎన్ఎస్పీ నుంచి మునిసిపాలిటీకి ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నప్పటికీ నిర్వహణకు నిధులు లేకపోవడంతో మునిసిపల్ శాఖ తీసుకోవడం లేదు.



నంది కొండ మున్సిపల్ కార్యాలయం

ప్రభుత్వం నిధులు వేతనాలు, మౌలిక వసతులకే.

రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ(స్టేట్ ఫైనాన్స్ కమిషన్) ఇచ్చే నిధులతో పాటు, 15వ ఆర్థిక సంఘం నుంచి వచ్చే నిధులు, తెలంగాణ అభివృద్ధి ప్రాంతీయ కమిషన్ నుంచి వచ్చే నిధులను ఇక్కడ పనిచేసే కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పారిశుధ్య కార్మికులకు వేతనాలకు సరిపోతున్నాయి. ఇక్కడ రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో స్టాంప్ డ్యూటీ నుంచి వచ్చే నిధులు కూడా లేవు. గతేడాది 58,59 జీవోల కింద కొన్ని నివాస గృహాలను రిజిస్ట్రేషన్ చేయడంతో ఈ ఏడాది రూ.77 వేలు నందికొండకు వచ్చాయి. ఈ ఏడాది ఎస్ఎఫ్‌సీ నిధులు రూ.21 లక్షలు రాగా, తెలంగాణ అభివృద్ధి ప్రాంతీయ కమిషన్ నుంచి రూ.8 కోట్లు వచ్చాయి. వాటిలో రూ. 4 కోట్లు పైలాన్ పిల్లర్ నుంచి జెన్‌కో కార్యాలయం వరకు రోడ్డు నిర్మాణానికి కేటా యించగా మిగిలిన రూ. 4 కోట్లు కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం కోరకు కేటాయించారు. అంతే కాకుండా గత ప్రభుత్వ పాలనలో రూ. కోటితో డిజి టల్ లైబ్రరీకి శంకుస్థాపన చేయగా ఆ నిధులను సీసీ రోడ్ల నిర్మాణానికి మళ్లించారు. ఎస్ఎఫ్‌సీ నిధుల్లో నెలకు రూ. 8 లక్షల చొప్పున సిబ్బంది వేతనాలు చెల్లిస్తున్నారు.

నిర్వహణ ఇబ్బందిగా మారింది

నందికొండ మునిసిపాలిటీలో ప్రైవేటు ఆస్తులు అంటూ ఏమి లేవు. అన్ని ప్రభుత్వ నివాస గృహాలే కాబట్టి ప్రాపర్టీ ట్యాక్స్ వంటివి వసూలు లేదు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో పాటు, 15వ ఫైనాన్స్ నిధులు, ఎస్ఎఫ్‌సీ నిధులు సిబ్బంది వేతనాలకు ఉపయోగిస్తున్నాం. ఎక్కడ నుంచి ఆదాయం వచ్చే వీలు లేకుండా పోయింది. నిర్వహణ ఇబ్బందిగా మారింది.

-శ్రీను, కమిషనర్, నందికొండ

మార్కెట్ యార్డ్‌పై దాడి అమానుషం


మార్కెట్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

మిర్యాలగూడ, మిర్యాలగూడ రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మార్కెట్ యార్డు కార్యాలయంపై విధ్వంసకర దాడి సంఘటన అమానుషమని ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగస్తుల సంఘం అధ్యక్షుడు బాలశెట్టి మధుబాబు అన్నారు. మండలంలోని అవంతీపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం ఉద్యోగస్తులతో కలిసి నిరసన వ్యక్తం చేసి ఆయన మాట్లాడారు. ధరల విషయంలో హెచ్చు తగ్గులకు మార్కెట్ కార్యదర్శికి, సిబ్బందికి ఎలాంటి సంబంధం ఉండదని, ఆ యా పరిస్థితులకు అనుగుణంగా హెచ్చుతగ్గులను సమీక్షించి సమన్వయం చేస్తారని అన్నారు. అసహనానికి గురైన కొందరు అనాలోచితంగా కార్యాల యంపై దాడి చేసి చైర్‌పర్సన్, కార్యదర్శి, సిబ్బందిపై భౌతికదాడులకు దిగడం తగదన్నారు. దాడులకు పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

కంప్యూటర్ల ఏర్పాటుకు చెక్కు అందజేత


హెచ్ఎం వినోద్‌కుమార్‌కు చెక్కు అందిస్తున్న దాత సందీప్‌రెడ్డి

మాడ్గులపల్లి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చర్లగూడెం గ్రామానికి చెందిన గోలి లింగారెడ్డి కుమారుడు సందీప్‌రెడ్డి మంగళవారం ఆగామోత్కూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు కంప్యూటర్లకు రూ.1.25 లక్షల చెక్కును యెలేటి వినోద్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సందీప్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. సందీప్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. కార్యక్రమంలో గోలి నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు నగేష్, జనార్దన్, నరేందర్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, ఆనందరెడ్డి, గురవయ్య, రమాజ్యోతి పాల్గొన్నారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ఏడుకొండలు యాదవ్

దేవరకొండ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్ అన్నారు. స్థానిక మద్దెలమ్మ దేవాలయంలో మంగళవారం నిర్వహించిన యాదవ సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలలో యాదవులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అనంతరం యాదవసంఘం దేవరకొండ పట్టణ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన నల్లగాసు విజయ్‌కుమార్‌కు నియామకపత్రం అందజేసి పూలమాల, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, సంఘం జిల్లా నాయకులు జంగిడి నర్సింహయాదవ్, నక్క వెంకటేష్‌యాదవ్, కొండ్ర శ్రీశైలం యాదవ్, బచ్చమోని వెంకటయ్య యాదవ్, శవ్వ వెంకటయ్య యాదవ్, కన్నెబోయిన మల్లయ్య యాదవ్, వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ మునిసిపల్ ప్రత్యేకాధికారిగా శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ స్పెషల్ ఆఫీసర్‌గా శ్రీనివాస్ నియమితులయ్యారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌ను ప్రత్యేకాధికారిగా నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌కు కమిషనర్ ఎండీ. యూసుఫ్ జిల్లా కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మునిసిపాలిటీకి సంబంధించి పలు అంశాలపై స్పెషల్ ఆఫీసర్ అడిగి తెలుసుకున్నట్లు కమిషనర్ తెలిపారు. ఆయనవెంట మునిసిపల్ అధికారులు ఉన్నారు.

నేడు మున్సిపాలిటీ పాలక వర్గానికి సన్మానం

హాలియా,(ఆంధ్రజ్యోతి):హాలియా మున్సిపాలిటీ పాలక వర్గం ఇటీవల వారి పదవి కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం హాలియా కార్యాలయంలో సమావేశ మందిరంలో సన్మానించనున్నట్లు కమిషనర్ రామదుర్గారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలి

మర్రిగూడ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఉదావత్ లచ్చిరాం డిమాండ్ చేశారు. మండలంలోని దామెరభీమనపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం భోజన విరామ సమయంలో యూపీఎస్ పత్రాలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కాట్రావత్ శ్రీనివాస్, సరంగి మంజులత, నుస్రత్ బేగం తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ బహిరంగసభను జయప్రదం చేయాలి


దేవరకొండ రహదారి బంగ్లాలో సమావేశంలో మాట్లాడుతున్న కంబాలపల్లి వెంకటయ్య

దేవరకొండ, జనవరి28(ఆంధ్రజ్యోతి): మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు ఫిబ్రవరి 7న తలపెట్టిన ఎస్సీ వర్గీకరణ అమలు కోసం లక్ష డప్పులు, వేల గొంతుకల మహాప్రదర్శన బహిరంగ సభ ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కంబాలపల్లి వెంకటయ్య అన్నారు. స్థానిక రహదారిబంగ్లాలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఏబీసీడీ వర్గీకరణ కోసం 30 ఏళ్లగా ఎమ్మార్పీఎస్ సుదీర్ఘ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణకు సహకరిస్తానని హామీ ఇచ్చాడని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సభకు ఎమ్మార్పీఎస్‌తో పాటు మాదిగ ఉప కులాలు వేలాదిగా తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎర్ర ఆంజనేయులు, పండ్ల శ్రీను, వెంకటయ్య, మధు, సుగుణయ్య, నిరంజన్ పాల్గొన్నారు.

● చింతపల్లి,(ఆంధ్ర జ్యోతి):ఎవ మ్మార్పీఎస్ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని సంఘం మండలాధ్యక్షుడు కోడుదోటి లక్ష్మణ్ తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ ఎబీసీడీ వర్గీకరణ బిల్లు అమలు చేసి సమ స్యల సాధన కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయ కులు ఎర్ర జగన్, ప్రచార కార్యదర్శి కుర్మేటి వెంకటరమణ, మాసం పెద్దయ్య, శంకర్, రాజు, శ్రీను, సైదులు, న్యాయవాది చెన్నయ్య పాల్గొన్నారు.

దరఖాస్తుల పేరుతో కాలం వెల్లదీస్తున్న ప్రభుత్వం


సమావేశంలో మాట్లాడుతున్న వానం నరేందర్‌రెడ్డి, ఏటీ కృష్ణ

డిండి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం దరఖాస్తుల పేరుతో కాలం వెల్లదీస్తుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వానం నరేందర్‌రెడ్డి, దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏటీ కృష్ణ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు అర్హులను గుర్తించడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. ప్రజా పాలన పట్ల ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో పోలీస్ పహారా నడుమ గ్రామసభలు నిర్వహించాల్సిన దుస్థితి రావడం బాధకరమని అన్నారు. పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభు త్వం ఒకవైపు గ్రామసభలు నిర్వహిస్తుంటే మరో వైపు కాంగ్రెస్ కార్యకర్తలకే పథకాలు ఇస్తామని నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు మూడు నెలలో అమలు చేస్తామని చెప్పి అధికారం చేపట్టి 15 నెలలు కావస్తున్న పథకాలు అమలుకాలేదని చెప్పారు.

చేయూత

కొండమల్లేపల్లి, జనవరి 28 (ఆంధ్ర జ్యోతి): గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామానికి చెందిన వేమిరెడ్డి సునీత అనారోగ్యంతో నల్లగొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. కాగా ఆపరేషన్‌కు డబ్బులు అవసరం కావడంతో విషయం తెలుసుకున్న ఆమెతో పాటు కొండమల్లేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి చదువుకున్న స్నేహితులు రూ. 26,300 సేకరించి మంగళవారం నల్లగొండ లోని ఆస్పత్రిలో సునీతను కలిసి అంద జేశారు. కార్యక్రమంలో సుధారాణి, శ్రీలత, అనిల్, వెంకటయ్య తదితరులున్నారు.

రైతు భరోసాకు దరఖాస్తులు

హాలియా, జనవరి 28(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పెట్టుబడి సాయం పథకానికి 2024-25 01.01.2025 వరకు కొత్తగా వచ్చిన పట్టాదారు పాస్‌పుస్తకం గల రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఏవో సరిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులకు పట్టాదారు పాస్‌పుస్తకం లేదా డిజిటల్ సంతకం అయినా జిరాక్స్, ఆధార్ కార్డ్ జిరాక్స్, బ్యాంక్ సేవింగ్ ఖాతా జిరాక్స్, దరఖాస్తు ఫారం, గతంలో పెట్టుబడి సాయం వచ్చిన రైతులు బ్యాంకు, అకౌంట్ నంబర్ మార్పులు ఉంటే రైతులు దరఖాస్తు ఫారంపై నింపి సంబంధిత క్లస్టర్ అధికారికి అందజేయాలని పేర్కొన్నారు.. ఈనెల 31 వరకు దరఖాస్తును చేసుకోవాలని సూచించారు..

రైతు మహా ధర్నాకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు


హాలియా : మాజీ ఎమ్మెల్యే భగత్ అధ్వర్యంలో నల్లగొండకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు


గుర్రంపోడు : బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి

హాలియా, జనవరి 28(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలో క్లాక్ టవర్ వద్ద మంగళవారం నిర్వహించిన రైతు మహాధర్నాకు మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. అనుముల మండలం, హాలియా మున్సిపాలిటీ నుంచి నాయకులు, రైతులు, కార్యకర్తలు సాగ ర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ముందుగా హాలియాలో బైక్ ర్యాలీ నిర్వహించి నల్లగొండకు తరలారు.

● మిర్యాలగూడ,(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో కార్లు, ఆటోలు, బైకులపై ర్యాలీగా నల్లగొండకు తరలివెళ్లారు. తెలంగాణ ఉద్యమ నాయకులు యడవెల్లి శ్రీనివాసరెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు మక్దుమ్, ఇలియాస్ ఖాన్, మాజీద్, షోయబ్, అయోధ్య, దుర్గాప్రసాద్, గంధం సైదులు, పిన్నబోయిన శ్రీనివాస్ యాదవ్, దినేష్, నల్లగంతుల నాగభూషణం, చిరంజీవి తదితరులు ఉన్నారు.

● గుర్రంపోడు, (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీతో నల్లగొండకు బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని, ఆ మోసాలను ఎండ గట్టడానికే ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెళ్లిన వారిలో రాజేష్‌రెడ్డి, మారం గోపాల్‌రెడ్డి, జాల మల్లేష్, సైదిరెడ్డి, వేముల యాదయ్య, యాదగిరి ఉన్నారు.

●కొండమల్లేపల్లి, (ఆంధ్రజ్యోతి) : మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు పెద్దసంఖ్యలో నల్లగొండకు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో నాయ కులు కేసాని లింగారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్, తులసిరాం, యాదయ్య, పెద్దిశెట్టి సత్యం, నరేందర్, శేఖర్, వెంకటేష్, రావుల సత్యానారాయణ, కృష్ణయ్య, శంకర్‌నాయక్, వెంకటేష్, భీమ, యాదయ్య, బాలు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

●చింతపల్లి,(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రం నుంచి తరలివెళ్లిన వారి లో మాజీ ఎంపీటీసీ ఎల్లంకి అశోక్, ఆంజనేయులు, బాదేపల్లి నిరంజన్ గౌడ్, వెంకటయ్య, జిట్ట జగదీష్, పాల్గొన్నారు.


మిర్యాలగూడ : జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న యడవెల్లి శ్రీనివాసరెడ్డి

యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలను వ్యతిరేకించాలి

హాలియా, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విశ్వ విద్యాలయాలను విధ్వంసం చేసే యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలను వ్యతిరేకించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. భారత రాజ్యాంగంలో ఉమ్మడి జాబి తాలో ఉన్న విద్య యూజీసీ నిబంధనల ద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను లాక్కుంటుందని దేశంలో విద్యను వ్యాపా రంగా కేంద్రీకరణ, కార్పొరేటీకరణ చేసే విధంగా బీజేపీ పోను కుటుందని ఆరోపించారు. ఇప్పటికే కేరళ, తమిళనాడు వంటి ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలు, వీసీల నియామకంపై గవర్నర్లతో విబేధాలు ఉన్నాయి, ఇప్పుడు సవరించిన యూజీసీ నిబంధనలతో వీసీల ఎంపిక చాన్స్ ఉన్న రాష్ట్ర గవర్నర్లకు అధిక అధికారాన్ని అందిస్తున్నాయన్నాయన్నారు. నూతన విద్యావిధానం 2020లో భాగంగా తీసుకొని వస్తున్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా వెంటనే సైతం వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరే రమేష్, శివ, అంజి, గోపి, వర్షిత్‌పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేష్

అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన


వెంకటేశ్వరనగర్ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన

చింతపల్లి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటేశ్వరనగర్ రెండో అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ సుగుణ మాట్లాడుతూ..చిన్నారులకు తగిన పౌష్టికాహారం అందించి గుణాత్మ విద్యను అందించాలన్నారు కార్యక్రమంలో టీచర్ బాదేపల్లి స్వప్న, ఆయా మును కుంట్ల బక్కమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

కొండమల్లేపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల నిర్మూలనపై జిల్లా స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీల్లో కొండమల్లేపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల 10వతరగతి విద్యార్థులు బొడ్డుపల్లి స్పందన ఉపన్యాస పోటీల్లో ప్రథమ బహుమతి సాధించగా, మహియా నిషాద్ వ్యాసరచన పోటీల్లో ద్వితీయ బహుమతి, ఆర్.అలేఖ్య పాటల పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులను ఎంఈవో నాగేశ్వర్‌రావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లెల జనార్దన్‌రెడ్డి, కొలిశెట్టి శ్రీధర్, గోరటి ఆంజనేయులు, కట్టెబోయిన శ్రీనివాసులు, జాన్ నాయక్, బక్క శ్రీనివాస్‌చారి, అశోక్‌కుమార్, సరస్వతి, నీరజ, అనురాధ, శ్రీదేవి, బాబు, శివప్రసాద్‌రెడ్డి, నాగార్జున, నరసింహ, గణేష్, నసీరుద్దీన్, యాదయ్య, సైదులు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.